STv SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/26/A3949

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

సమయం

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 1 | సంచిక: 124 | ఎడిటర్ : అలీ ముర్తుజా | బుధవారం 18 నవంబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |



గ్యాస్ లీకేజీ కలకలం!

గెడ్డాడ సమీపంలోని బావి వద్ద తెల్లవారుజామున ఘటన

- వర్కోవర్ పనులు జరుగుతుండగా లీకైన గ్యాస్
- హుటాహుటిన రంగంలోకి దిగిన ఓఎన్జీసీ విపత్తు నిర్వహణ బృందాలు
- 500 మీటర్ల పరిధిలో ప్రజల తరలింపు
- జాతీయ రహదారి 216పై వాహనాల రాకపోకల నిలిపివేత
- పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందన్న ఓఎన్జీసీ అధికారులు

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గ్యాస్ లీకేజీ ఘటన తీవ్ర కలకలం రేపింది. మామిడికుదురు మండలం గెడ్డాడ గ్రామ సమీపంలో జాతీయ రహదారి 216 పక్కన ఉన్న గ్యాస్ బావి వద్ద మంగళవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో ఒక్కసారిగా గ్యాస్ లీకైంది. బావి వద్ద వర్కోవర్ పనులు జరుగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. తెల్లవారుజామున భారీ శబ్దంతో గ్యాస్ బయటకు వస్తుండటంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఈ ప్రమాద తీవ్రతను గుర్తించిన ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్జీసీ) అధికారులు తక్షణమే స్పందించి అత్యవసర నియంత్రణ చర్యలు చేపట్టారు.

3

బ్లో అవుట్ ఘటనపై.. పవన్ ఆరా!



- గ్యాస్ బావి వద్ద లీకేజీపై కలెక్టర్‌తో మాట్లాడిన డిప్యూటీ సీఎం
- ఓఎన్జీసీ భద్రతా చర్యలపై సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని సూచన
- 'అక్వాన్' ముప్పు పైనా అధికారులతో అత్యవసర సమీక్ష

2

మోసాల్లో వాళ్లిద్దరూ గురుశిష్యులే!



రామోజీరావు జయంతిని రాష్ట్ర అధికారిక కార్యక్రమంగా కూటమి ప్రభుత్వం ప్రకటించడాన్ని ఎన్టీఆర్ సతీమణి, వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందమూరి లక్ష్మీపార్వతి తీవ్రంగా తప్పుబట్టారు. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడవడంలో చంద్రబాబు నాయుడి పాత్ర ఎంత ఉందో, రామోజీరావు పాత్ర కూడా అంతే ఉందని ఆమె ధ్వజమెత్తారు. మోసాలు చేయడంలో వీరిద్దరూ గురుశిష్యులని తీవ్ర స్థాయిలో విమర్శించారు.

3



రాష్ట్రానికి తక్షణ సాయం అందించండి

వరుస తుపానులతో రూ.7 వేల కోట్లకు పైగా అపార నష్టం

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సీఎం చంద్రబాబు భేటీ

2

రెండు భారీ తుపాన్ల తాకిడితో అపార నష్టం వాటిల్లిందని, కష్టాల్లో ఉన్న రాష్ట్రాన్ని ఆదుకుని తక్షణ ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు.

అక్వాన్ ముప్పు.. అప్రమత్తంగా ఉండాలి

తుఫాన్ పరిస్థితిపై అధికారులతో సీఎం టెలీకాన్ఫరెన్స్

- ప్రజలకు ఎప్పటికప్పుడు వాతావరణ హెచ్చరికలు పంపాలి
- విపత్తులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్న చంద్రబాబు

2





పోటీ కాదు.. సహకారమే మన భవిష్యత్తు!

- భారత్-ఆసియాన్ సదస్సులో ప్రధాని మోదీ పిలుపు
- ప్రపంచ జనాభాలో నాలుగో వంతుకు ప్రాతినిధ్యం
- శాంతి, స్థిరత్వం, సమష్టి అభివృద్ధే లక్ష్యం

4

భారత్-ఆసియాన్ దేశాల కూటమి కలిసి ప్రపంచ జనాభాలో దాదాపు నాలుగో వంతుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయని, కాబట్టి మన ఉమ్మడి భవిష్యత్తును కేవలం పోటీ కాకుండా పరస్పర సహకారమే నిర్దేశించాలని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. మంగళవారం ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జరిగిన ఇండియా-ఆసియాన్ శిఖరాగ్ర సదస్సులో 11 సభ్య దేశాల నేతలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.

ఉక్కు సంకల్పం.. ఆత్మనిర్భర్ భారత్!

2030 నాటికి 300 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యం

స్టీల్ కాంక్లేవ్‌లో కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ వెల్లడి

220 మిలియన్ టన్నులకు చేరిన దేశీయ ఉత్పత్తి సామర్థ్యం

కడపలో జేఎస్‌డబ్ల్యూ ప్లాంట్ ఏర్పాటుపై మంత్రి ప్రశంసలు

2



రాజకీయ రంగు పులమొద్దు



తన కుమార్తె వివాహానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆహ్వానించడంపై సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనాన్ని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. వ్యక్తిగత కుటుంబ వ్యవహారాలను రాజకీయాలతో ముడిపెట్టడం, కుటుంబ సంబంధాలకు వక్రభాష్యం చెప్పడం ఏమాత్రం సరికాదని ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు.

3

పోలవరం పనుల తీరు.. భేష్!

- నిర్మాణ వేగం, నాణ్యతపై పీపీఏ సీఈఓ సంజీవ్ హోహ్రా సంతృప్తి
- జలవనరుల శాఖ, మేఘా సంస్థ ప్రతినిధులతో సుదీర్ఘ సమీక్ష
- క్షేత్రస్థాయిలో ఈసీఆర్ఎఫ్, జీ హిల్ పనుల పరిశీలన
- అక్కడికక్కడే మట్టి, కాంక్రీట్ నాణ్యత పరీక్షల నిర్వహణ
- తుపాను ముప్పు నేపథ్యంలో అధికారులకు ముందస్తు హెచ్చరికలు

03

26న సెలవు!

- ఎన్నికలు జరుగుతున్న 23 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో వర్తింపు
- జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు

02





బ్లో అవుట్ ఘటనపై.. పవన్ ఆరా!

గ్యాస్ బావి వద్ద లీకేజీపై కలెక్టర్‌తో మాట్లాడిన డిప్యూటీ సీఎం

ఓఎన్జీసీ భద్రతా చర్యలపై సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని సూచన

'అక్వాన్' ముప్పు పైనా అధికారులతో అత్యవసర సమీక్ష

గత రెండు తుపాన్ల కంటే ఎక్కువ ప్రభావం ఉండే అవకాశం

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు అప్రమత్తంగా ఉండాలి

అమరావతి, నవంబర్ 17 (సమయం న్యూస్): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం నగరం గ్రామ పరిధిలో ఓఎన్జీసీ గ్యాస్ డ్రిల్లింగ్ బావి వద్ద చోటుచేసుకున్న బ్లో అవుట్ ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆరా తీశారు. గ్యాస్ లీకేజీ తీవ్రత, పరిసర గ్రామాల ప్రజల భద్రతకు సంబంధించి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున పెద్ద శబ్దంతో ఒక్కసారిగా గ్యాస్ వెలువడినట్లు కలెక్టర్ ఆయనకు వివరించారు. కిలోమీటరు పరిధిలో ఉన్న గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రానికి తరలించామని, జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలను నిలిపివేశామని తెలిపారు. ఓఎన్జీసీ సాంకేతిక బృందం ఘటనా స్థలానికి చేరుకుని లీకేజీని అరికట్టేందుకు చర్యలు చేపట్టిందని వివరించారు. వరుసగా గ్యాస్ లీకేజీ, బ్లో అవుట్ ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో ఓఎన్జీసీ అధికారులతో మాట్లాడి తక్షణమే సమగ్ర సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు.

'అక్వాన్' ముప్పుపైనా సమీక్ష..

అక్వాన్ తుపానును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. గత రెండు తుపాన్లతో పోలిస్తే అక్వాన్ ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో తీర ప్రాంత గ్రామాల్లో ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ నెల 20వ తేదీన నెల్లూరుఉతుని మధ్య గంటకు 120 నుంచి 145 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో తుపాను తీరం దాటే అవకాశం ఉందని అధికారులు వివరించారు. ఈ నెల 19, 20 తేదీల్లో ప్రభావిత జిల్లాల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు.

సమన్వయంతో పనిచేయాలి..

రెడ్ అలర్ట్ ప్రకటించిన జిల్లాల యంత్రాంగం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, తీర, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. పోలీస్, రెవెన్యూ, విద్యుత్, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ తదితర శాఖల మధ్య పక్కా సమన్వయం ఉండాలన్నారు. నెల రోజుల వ్యవధిలో అర్నబ్, మురసు తుపాన్ల కారణంగా 520 కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారులు ధ్వంసమయ్యాయని, వాటిని వెంటనే పునరుద్ధరించాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినట్లు పవన్ వెల్లడించారు. తుపాను తీవ్రత అధికంగా ఉండే ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని, రోడ్లపై చెట్లు కూలిపోతే వెంటనే తొలగించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం, వాతావరణ శాఖ నుంచి వచ్చే హెచ్చరికలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేయాలని సూచించారు.


26న సెలవు!

ఎన్నికలు జరుగుతున్న 23 పట్టణ సంస్థల పరిధిలో వర్తింపు

ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవు

జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు

పోలింగ్ అవసరాలకు ప్రభుత్వ వాహనాల స్వాధీనం



అమరావతి, నవంబర్ 17 (సమయం న్యూస్): రాష్ట్రంలో ఈ నెల 26న పోలింగ్ నిర్వహిస్తున్న 23 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల ఉద్యోగులకు ఈ సెలవు వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రైవేట్ సంస్థలు, షాపుల్లో పనిచేసే వారికి, కంపెనీల ఉద్యోగులు సైతం తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అదే రోజు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. ఎన్నికలు జరుగుతున్న 23 ప్రాంతాల్లో వివిధ శాఖల ఆధ్వర్యంలోని ప్రభుత్వ వాహనాలను పోలింగ్ అవసరాలకు వినియోగించుకునేందుకు కలెక్టర్లకు అప్పగించాలని మరో ఉత్తర్వులో ప్రభుత్వం స్పష్టం చేసింది.

రాష్ట్రానికి తక్షణ సాయం అందించండి

- **వరుస తుపానులతో రూ.7 వేల కోట్లకు పైగా అపార నష్టం**
- **కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సీఎం చంద్రబాబు భేటీ**
- **రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి**
- **విశాఖ ఎకనమిక్ రీజియన్ అభివృద్ధికి అదనపు సాయంపై చర్చ**
- **సీఐఐ సదస్సు విజయాలను కేంద్ర మంత్రికి వివరించిన ముఖ్యమంత్రి**



న్యూఢిల్లీ, నవంబర్ 17 (సమయం న్యూస్): రెండు భారీ తుపాన్ల తాకిడితో అపార నష్టం వాటిల్లిందని, కష్టాల్లో ఉన్న రాష్ట్రాన్ని ఆదుకుని తక్షణ ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, వరుస తుపాన్ల నష్టం, హార్టికల్చర్ హబ్, పూర్వోదయ నిధులు, ప్రాంతాల వారీగా అభివృద్ధి ప్రణాళికలపై సుదీర్ఘంగా చర్చించారు. ఇటీవల రాష్ట్రాన్ని అతలాకుత చేసిన అర్నబ్, మురసు తుపాన్ల వల్ల జరిగిన నష్టాన్ని కేంద్ర మంత్రికి చంద్రబాబు వివరించారు. ప్రాథమిక అంచనాల ప్రకారమే సుమారు రూ.7 వేల కోట్లకు పైగా ఆస్తి, పంట నష్టం వాటిల్లిందని తెలిపారు. ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ రైతులను గట్టెక్కించేందుకు పట్టిసీమ ద్వారా సాగునీరు అందించామని, అయితే వరుస తుపాన్లు రైతుల ఆశలపై నీళ్లు చల్లాయని ఆవేదన వ్యక్తం చేశారు. తీర ప్రాంతాల్లో భారీ ఎత్తున మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయని, ముఖ్యంగా విద్యుత్ వ్యవస్థ ఛిన్నాభిన్నమైందని వివరించారు. రాష్ట్రంలో పర్యటించిన కేంద్ర బృందాలు త్వరలోనే నివేదిక ఇస్తాయని, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో తక్షణ సాయం అందిస్తే రాష్ట్రానికి కొంతమేర ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని విజ్ఞప్తి చేశారు.

ప్రాంతాల వారీగా.. అభివృద్ధి ప్రణాళికలు..

కేంద్ర మంత్రితో జరిగిన సమావేశంలో రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి ప్రణాళికలు ప్రధానంగా చర్చకు వచ్చాయి. విశాఖ, అమరావతి, తిరుపతి రీజియన్ల వారీగా ప్రత్యేకంగా ఆర్థికాభివృద్ధి ప్రణాళికలు రూపొందించినట్లు సీఎం తెలిపారు. గతంలో నిర్మలా సీతారామన్ స్వయంగా శంకుస్థాపన చేసిన రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు తక్షణమే నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ హబ్‌లో భాగంగా మౌలిక వసతులు, గ్రామాలకు రోడ్ నెట్ వర్క్, డ్రిప్ ఇరిగేషన్ పనులపై ప్రత్యేక దృష్టి సారించామని వివరించారు. అలాగే శరవేగంగా ఎదుగుతున్న విశాఖ ఎకనమిక్ రీజియన్ అభివృద్ధికి అవసరమైన అదనపు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం మరింత సహకారం అందిస్తే అభివృద్ధి ఫలాలు ప్రజలందరికీ వేగంగా అందుతాయని స్పష్టం చేశారు. ఇటీవల విశాఖలో అత్యంత విజయవంతంగా ముగిసిన సీఐఐ భాగస్వామ్య సదస్సు వివరాలను సైతం నిర్మలా సీతారామన్‌కు సీఎం వివరించారు. ఆ సదస్సులో తీసుకున్న కీలక నిర్ణయాలు, రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులపై చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, పలువురు ఎంపీలు, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అక్వాన్ ముప్పు.. అప్రమత్తంగా ఉండాలి!

- **తుఫాన్ పరిస్థితిపై అధికారులతో సీఎం టెలీకాన్ఫరెన్స్**
- **మంగళవారం సాయంత్రానికి తీవ్ర తుఫాన్‌గా మారే ప్రమాదం**
- **19, 20 తేదీల్లో భారీ వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం**
- **ప్రజలకు ఎప్పటికప్పుడు వాతావరణ హెచ్చరికలు పంపాలి**
- **విపత్తులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్న చంద్రబాబు**

అమరావతి, నవంబర్ 17 (సమయం న్యూస్): రాష్ట్రాన్ని ముంచెత్తేందుకు వస్తున్న అక్వాన్ తుఫాన్ నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. తుఫాన్ కదలికలు, తీవ్రత, ప్రభావిత ప్రాంతాల్లో తీసుకుంటున్న ముందస్తు చర్యలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం తుఫాన్ గంటకు 3 కిలోమీటర్ల వేగంతో కదులుతోందని అధికారులు సీఎంకు వివరించారు. మంగళవారం సాయంత్రానికి తుఫాన్ తీవ్రతపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని, అప్పటికి తీవ్ర తుఫాన్‌గా మారే ప్రమాదం ఉందని ఆర్టీజీఎస్ అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం తుఫాన్ చెన్నైకి 610 కిలోమీటర్లు, మచిలీపట్నానికి 660 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 670 కిలోమీటర్లు, ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు 790 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉన్నట్లు తెలిపారు. అక్వాన్ ప్రభావంతో ఈ నెల 19, 20 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, తీరాన్ని దాటే సమయంలో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని స్పష్టం చేశారు.

ప్రజల్లో భరోసా కల్పించాలి..

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో రాష్ట్రం ఎదుర్కొంటున్న మూడో తుఫాన్ ఇదని గుర్తుచేశారు. విపత్తులు సంభవించినప్పుడు భయపడాల్సిన అవసరం లేదని, వాటి ప్రభావం ప్రజలపై పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ఎప్పటికప్పుడు వాతావరణ హెచ్చరికలు పంపాలని, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బంది ద్వారా ప్రజలకు నేరుగా సమాచారం అందించాలని ఆదేశించారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంతటి పెద్ద విపత్తు ఎదురైనా ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం, అధికారులు సిద్ధంగా ఉన్నారనే భరోసా కల్పించాలన్నారు.

తక్షణమే పునరుద్ధరణ చర్యలు..

తుఫాన్ కారణంగా చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోతే వెంటనే తొలగించి విద్యుత్, రవాణా వ్యవస్థలను



పునరుద్ధరించాలని ఆదేశించారు. విపత్తు పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ రియల్‌టైమ్‌లో సహాయక చర్యలు చేపట్టాలని, అవసరమైన ప్రాంతాల్లో రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహించి ప్రజలకు పునరావాసం కల్పించాలని సూచించారు. భారీ వర్షాలతో చెరువులు, కాల్వలకు గండ్లు పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

ఉక్కు సంకల్పం.. ఆత్మనిర్భర్ భారత్!

- **2030 నాటికి 300 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యం**
- **స్టీల్ కాంక్లేవ్‌లో కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ వెల్లడి**
- **పర్యావరణ పరిరక్షణ కోసం గ్రీన్ స్టీల్ ట్యాక్సానమీ**
- **220 మిలియన్ టన్నులకు చేరిన దేశీయ ఉత్పత్తి సామర్థ్యం**
- **కడపలో జేఎస్‌డబ్ల్యూ ప్లాంట్ ఏర్పాటుపై మంత్రి ప్రశంసలు**



న్యూఢిల్లీ, నవంబర్ 17 (సమయం న్యూస్): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించే దిశగా దేశం శరవేగంగా ముందుకు సాగుతోందని, ఈ బృహత్తర లక్ష్య సాధనలో ఉక్కు రంగం అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ స్పష్టం చేశారు. 2030 నాటికి దేశీయ ఉక్కు ఉత్పత్తి సామర్థ్యాన్ని 300 మిలియన్ టన్నులకు పెంచడమే ప్రధాన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం, పరిశ్రమలు సమన్వయంతో అడుగులు వేస్తున్నాయని తెలిపారు. న్యూఢిల్లీలో మంగళవారం నిర్వహించిన ఇండియన్ స్టీల్ అసోసియేషన్ ఏడో స్టీల్ కాంక్లేవ్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన కీలక ప్రసంగం చేశారు. ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి దేశీయ ఉత్పత్తి, అత్యాధునిక సాంకేతిక ఆవిష్కరణలు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాల అభివృద్ధి ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పైప్‌లైన్, పీఎం గతిశక్తి, మేక్ ఇన్ ఇండియా లాంటి బృహత్తర కార్యక్రమాలతో దేశంలో ఉక్కుకు డిమాండ్ గణనీయంగా పెరిగిందన్నారు. దీనికి అనుగుణంగా ఉక్కు పరిశ్రమ కూడా ఉత్పత్తి, సామర్థ్యం, వినియోగంలో సరికొత్త వృద్ధిని నమోదు చేస్తోందని వివరించారు.

మూడేళ్లలోనే 40 మిలియన్ టన్నుల సామర్థ్యం పెంపు..

గత ఏడాది దేశంలో ముడి ఉక్కు ఉత్పత్తి 10.7 శాతం వృద్ధితో 168.4 మిలియన్ టన్నులకు చేరుకుందని మంత్రి శ్రీనివాస వర్మ వెల్లడించారు. కేవలం మూడేళ్ల వ్యవధిలోనే అదనంగా 40 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం పెరిగిందని, దీంతో దేశీయ ఉత్పత్తి సామర్థ్యం 180 మిలియన్ టన్నుల నుంచి ఏకంగా 220 మిలియన్ టన్నులకు పైగా విస్తరించిందని వివరించారు. దేశంలో తలసరి ఉక్కు వినియోగం 97.7 కిలోల నుంచి దాదాపు 116 కిలోలకు పెరగడం.. ఆర్థిక, మౌలిక సదుపాయాల అద్భుత వృద్ధికి నిదర్శనమని ఆయన కొనియాడారు. ప్రస్తుత వృద్ధి ధోరణి ఇలాగే కొనసాగితే జాతీయ ఉక్కు విధానం నిర్దేశించిన 2030 నాటి 300 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని అలవోకగా చేరుకోవడం సాధ్యమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. 2026ఉ 27 కేంద్ర బడ్జెట్‌లో మూలధన వ్యయాన్ని రికార్డు స్థాయిలో రూ.12.2 లక్షల కోట్లకు పెంచడం ఉక్కు పరిశ్రమకు మరింత ఊతమిస్తుందని తెలిపారు. జాతీయ రహదారులు, డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ల అభివృద్ధితో గనులు, ఉక్కు కర్మాగారాలు, ఓడరేవుల మధ్య రవాణా అనుసంధానం ఎంతో మెరుగుపడుతోందన్నారు.

కడప గ్రీన్ స్టీల్ ప్లాంట్‌పై ప్రత్యేక ప్రశంసలు..

పారిశ్రామిక అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని శ్రీనివాస వర్మ తెలిపారు. 2070 నాటికి నెట్‌జీరో ఉద్గారాల లక్ష్యాన్ని సాధించాలన్న బలమైన సంకల్పంలో భాగంగా.. గ్రీన్ స్టీల్ ట్యాక్సానమీని ప్రవేశపెట్టిన ప్రపంచంలోనే తొలి దేశంగా భారత్ నిలిచిందని ఆయన గర్వంగా చెప్పారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాలో జేఎస్‌డబ్ల్యూ గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు జరుగుతున్న ప్రయత్నాలపై కేంద్ర మంత్రి తీవ్ర సంతోషం వ్యక్తం చేశారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కోసం విశేష కృషి చేస్తున్న జేఎస్‌డబ్ల్యూ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో జయంత్ ఆచార్యను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి భారీ పరిశ్రమల పెట్టుబడులు ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధికి, యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు ఎంతగానో దోహదపడతాయని ఆయన ఆకాంక్షించారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో టాటా స్టీల్ కార్పొరేట్ సర్వీసెస్ వైస్ ప్రెసిడెంట్ డి.బి.సుందర రామం, కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రముఖ ఉక్కు పరిశ్రమల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

కోనసీమలో గ్యాస్ లీకేజీ కలకలం!

- గెడ్డాడ సమీపంలోని బావి వద్ద తెల్లవారుజామున ఘటన
- వర్కోవర్ పనులు జరుగుతుండగా లీకైన గ్యాస్
- రంగంలోకి దిగిన ఓఎన్జీసీ విపత్తు నిర్వహణ బృందాలు
- 500 మీటర్ల పరిధిలో ప్రజల తరలింపు
- జాతీయ రహదారి 216పై రాకపోకల నిలిపివేత
- పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందన్న ఓఎన్జీసీ అధికారులు



న్యూఢిల్లీ, నవంబర్ 17 (సమయం న్యూస్): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గ్యాస్ లీకేజీ ఘటన తీవ్ర కలకలం రేపింది. మామిడికుదురు మండలం గెడ్డాడ గ్రామ సమీపంలో జాతీయ రహదారి 216 పక్కన ఉన్న గ్యాస్ బావి వద్ద మంగళవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో ఒక్కసారిగా గ్యాస్ లీకైంది. బావి వద్ద వర్కోవర్ పనులు జరుగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. తెల్లవారుజామున భారీ శబ్దంతో గ్యాస్ బయటకు వస్తుండటంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఈ ప్రమాద తీవ్రతను గుర్తించిన ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్జీసీ) అధికారులు తక్షణమే స్పందించి అత్యవసర నియంత్రణ చర్యలు చేపట్టారు.

రంగంలోకి విపత్తు నిర్వహణ బృందాలు..

సమాచారం అందిన వెంటనే ఓఎన్జీసీ రాజమండ్రి అసెట్ విపత్తు నిర్వహణ బృందం అప్రమత్తమైంది. అత్యవసర స్పందన బృందం హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని భద్రతా చర్యలతో పాటు గ్యాస్ లీకేజీ నియంత్రణ పనులు ప్రారంభించింది. విపత్తు నిర్వహణ ప్రణాళికను తక్షణమే అమల్లోకి తీసుకొచ్చారు. నర్సాపూర్‌లోని ప్రాంతీయ సంక్షోభ నిర్వహణ కేంద్రాల నుంచి అదనపు సిబ్బందిని, ప్రత్యేక పరికరాలను, ఇతర వనరులను ఘటనా స్థలానికి తరలించారు. ముందస్తు జాగ్రత్తగా గ్యాస్ బావి చుట్టూ 500 మీటర్ల పరిధిని పూర్తిగా దిగ్బంధించారు. ఆ ప్రాంతం చుట్టుపక్కల ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ప్రమాద తీవ్రతను తగ్గించేందుకు ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. జాతీయ రహదారి 216లో ప్రభావిత ప్రాంతం మీదుగా రాకపోకలను పూర్తిగా నిలిపివేసి, వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించారు. మంటలు చెలరేగకుండా ముందుజాగ్రత్త చర్యగా బావి వద్ద నీటి తెరను (వాటర్ కర్టెన్) ఏర్పాటు చేశారు.

ప్రస్తుతానికి సాంద్రత సున్నా..

అనంతరం ఘటనా స్థలంలో నిర్వహించిన గ్యాస్ సాంద్రత పరీక్షల్లో.. పరిశీలించిన ప్రాంతాల్లో గ్యాస్ సాంద్రత సున్నాగా నమోదైనట్లు ఓఎన్జీసీ తెలిపింది. అయినప్పటికీ నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు వెల్లడించింది. జిల్లా యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో ఓఎన్జీసీ స్థానిక అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. సిబ్బంది, స్థానిక ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ.. గ్యాస్ లీకేజీని సురక్షితంగా, వీలైనంత త్వరగా నియంత్రించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఓఎన్జీసీ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.

పోలవరం పనుల తీరు.. భేష్!

- నిర్మాణ వేగం, నాణ్యతపై పీపీఏ సీఈఓ సంజీవ్ మోహ్రా సంతృప్తి
- జలవనరుల శాఖ, మేఘా సంస్థ ప్రతినిధులతో సుదీర్ఘ సమీక్ష
- క్షేత్రస్థాయిలో ఈసీఆర్ఎఫ్, జీ హిల్ పనుల పరిశీలన
- అక్కడికక్కడే మట్టి, కాంక్రీట్ నాణ్యత పరీక్షల నిర్వహణ
- తుపాను ముప్పు నేపథ్యంలో అధికారులకు ముందస్తు హెచ్చరికలు



పోలవరం, నవంబర్ 17 (సమయం న్యూస్): పోలవరం ప్రాజెక్టు పనులు శరవేగంగా సాగుతున్నాయని, అదే సమయంలో నాణ్యత కూడా ఎంతో బాగుందని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సీఈఓ సంజీవ్ మోహ్రా కితాబిచ్చారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రాజెక్టు పనులను ఆయన సమగ్రంగా సమీక్షించారు. ముందుగా ప్రాజెక్ట్ సమావేశ మందిరంలో జలవనరుల శాఖ అధికారులు, నిర్మాణ సంస్థ మేఘా ప్రతినిధులతో భేటీ అయ్యారు. పీపీఏ సభ్య కార్యదర్శి ఎం.రఘురామ్, చీఫ్ ఇంజనీర్ ఎం.రమేష్ కుమార్‌లతో కలిసి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పనుల పురోగతిని వివరించారు. గత పర్యటనలో తాను చేసిన సూచనలు, ఇటీవల విదేశీ నిపుణుల బృందం ఇచ్చిన సలహాల అమలు తీరును సీఈఓ అడిగి తెలుసుకున్నారు. పనుల వేగం పెరిగిన నేపథ్యంలో ఎంత మంది కార్మికులు, ఎన్ని యంత్రాలు పనిచేస్తున్నాయనే వివరాలు ఆరా తీశారు.

నాణ్యతలో రాజీ వద్దు..

సమీక్ష అనంతరం అధికారులతో కలిసి ఈసీఆర్ఎఫ్ నిర్మాణ ప్రాంతం, జీ హిల్, జీ డాష్ హిల్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పనులను మోహ్రా పరిశీలించారు. మట్టి, ఇసుక, రాయి, కంకర, కాంక్రీట్ నాణ్యతను అక్కడికక్కడే పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. పనుల వేగంతో పాటు నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని అధికారులను ఆదేశించారు. నాణ్యత పరీక్షలు నిరంతరం చేస్తూ రికార్డులను భద్రపరచాలని సూచించారు. మళ్లీ తుపాను హెచ్చరికల నేపథ్యంలో ప్రాజెక్టులో నీటిమట్టం పెరిగే అవకాశం ఉన్నందున, పూర్తయిన పనులకు నష్టం జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. ప్రతిరోజూ నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు పనులు పూర్తయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖ ఈఎన్సీ కె.నరసింహమూర్తి, పోలవరం ఎస్ఈ పి.రామచంద్రరావు, నాణ్యత విభాగం సీఈ శేషుబాబు, ఎస్ఈ నరసింహారావు, ఈఈలు బాలకృష్ణ, శ్రీనివాస్, ప్రేమ్ చంద్, మేఘా సంస్థ ప్రాజెక్టు జనరల్ మేనేజర్ ఏ.గంగాధర్ కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్లు మురళి పమ్మి, గుట్టపాటి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



సీఎం భద్రత కోసం.. కొత్త కాన్వాయ్!

ఆరు కొత్త ఫోర్స్ అర్బానియా వాహనాల కొనుగోలు

పారదర్శకత కోసం జెమ్ పోర్టల్ ద్వారా టెండర్లు

ఒక్కో వాహనం సగటు ధర రూ.29.67 లక్షలు

టయోటా వాహనాల స్థానంలో వీటిని ప్రవేశపెట్టనున్న అధికారులు

అమరావతి, నవంబర్ 17 (సమయం న్యూస్): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి భద్రతా కాన్వాయ్ కోసం కొత్త వాహనాలు రానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర హోంశాఖ ఆరు కొత్త ఫోర్స్ అర్బానియా 4400 డబ్ల్యూబీ వాహనాల కొనుగోలుకు తాజాగా అనుమతులు మంజూరు చేసింది. వీటి కోసం ప్రభుత్వం మొత్తం రూ.1.78 కోట్లు వెచ్చించనుంది. ఈ లెక్కన చూస్తే ఒక్కో వాహనం ధర సగటున రూ.29.67 లక్షలుగా ఉండనుంది. నిధుల ఖర్చులో పూర్తి పారదర్శకత కోసం జెమ్ పోర్టల్ ద్వారా మాత్రమే ఈ వాహనాలను కొనుగోలు చేయనున్నారు. ప్రస్తుతం సీఎం కాన్వాయ్‌లో వినియోగిస్తున్న టయోటా వాహనాల స్థానంలో ఈ ఫోర్స్ అర్బానియా కొత్త వాహనాలను ప్రవేశపెట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు.

డీఎస్సీ కోచింగ్‌కు టెండర్లు!

బీసీ అభ్యర్థులకు శిక్షణ అందించేందుకు ఎంపానెల్‌మెంట్

అర్హత కలిగిన సంస్థలు దరఖాస్తు చేసుకోవాలని ఆహ్వానం

ఈ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా టెండర్లలో పాల్గొనాలి

నవంబర్ 24వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువు

విజయవాడ, నవంబర్ 17 (సమయం న్యూస్) : రాష్ట్రంలోని బీసీ అభ్యర్థులకు డీఎస్సీ పరీక్షలకు సంబంధించి ఉచితంగా మెరుగైన శిక్షణ అందించేందుకు ఆన్‌లైన్ కోచింగ్ సంస్థల ఎంపానెల్‌మెంట్‌కు అర్హత కలిగిన సంస్థల నుంచి టెండర్లు ఆహ్వానించినట్లు బీసీ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ ఏ.మల్లికార్జున తెలిపారు. ఆసక్తి ఉన్న కోచింగ్ సంస్థలు ఆంధ్రప్రదేశ్ ఈ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా టెండర్ ప్రక్రియలో పాల్గొనవచ్చని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెండర్ పత్రాలను నవంబర్ 17 ఉదయం 10 గంటల నుంచి నవంబర్ 24వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని స్పష్టం చేశారు. పూర్తి వివరాలు, నిబంధనల కోసం తాడిగడపలోని డైరెక్టరేట్ ఆఫ్ బీసీ వెల్ఫేర్ (విశాల్ రెసిడెన్సీ, 2, 3వ అంతస్తులు, పద్మజానగర్) కార్యాలయాన్ని స్వయంగా సంప్రదించాలని సూచించారు. అర్హత కలిగిన ఆన్‌లైన్ కోచింగ్ సంస్థలు నిర్ణీత గడువులోగా ఈ టెండర్ ప్రక్రియలో పాల్గొనాలని ఆయన కోరారు.



రాజకీయ రంగు పులమొద్దు

సాక్షి కథనంపై.. షర్మిల ఫైర్!

కూతురి పెళ్లికి సీఎంను ఆహ్వానించడం తప్పా?

పత్రికలో కథనంపై ఏపీ పీసీసీ చీఫ్ తీవ్ర అభ్యంతరం

గతంలో వైఎస్సార్ సైతం చంద్రబాబును పిలిచారని గుర్తింపు

తక్షణమే జగన్ వివరణ ఇచ్చి క్షమాపణ చెప్పాలని డిమాండ్



విజయవాడ, నవంబర్ 17 (సమయం న్యూస్): తన కుమార్తె వివాహానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆహ్వానించడంపై సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనాన్ని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. వ్యక్తిగత కుటుంబ వ్యవహారాలను రాజకీయాలతో ముడిపెట్టడం, కుటుంబ సంబంధాలకు వక్రభాష్యం చెప్పడం ఏమాత్రం సరికాదని ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇంట్లో జరిగే పెళ్లికి ఎవరినైనా ఆహ్వానించడం అనేది కుటుంబ సంప్రదాయాలు, ఆత్మీయ సంబంధాలకు సంబంధించిన వ్యక్తిగత విషయమని షర్మిల స్పష్టం చేశారు. ఇలాంటి సున్నితమైన అంశాలకు రాజకీయ రంగు పులిమి, తనతో పాటు కుటుంబ సభ్యుల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా కథనాలు రాయడం ఏమాత్రం తగదని హితవు పలికారు.

మా నాన్న కూడా పిలిచారు..

గతంలో తన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సైతం తన పిల్లల వివాహాలకు చంద్రబాబు నాయుడును ఆహ్వానించిన విషయాన్ని ఆమె ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ కథనంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తక్షణమే సమాధానం చెప్పాలని షర్మిల డిమాండ్ చేశారు. పత్రికలో వచ్చిన కథనంపై జగన్ లేదా ఆ పత్రిక యాజమాన్యం స్పష్టమైన వివరణ ఇవ్వాలని, జరిగిన పరిణామాలపై బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆమె పట్టుబట్టారు. కుటుంబ సంబంధాలను ఎట్టిపరిస్థితుల్లోనూ రాజకీయ వివాదాల్లోకి లాగవద్దని ఆమె తేల్చిచెప్పారు.

మోసాల్లో వాళ్లిద్దరూ గురుశిష్యులే!

ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచిన చరిత్ర రామోజీది

అలాంటి వ్యక్తికి రాష్ట్ర పండుగ చేస్తారా?

చంద్రబాబుపై మండిపడ్డ నందమూరి లక్ష్మీపార్వతి

మామకు భారతరత్న రాకుండా అడ్డుపడుతున్నారని విమర్శ



తాడేపల్లి, నవంబర్ 17 (సమయం న్యూస్): రామోజీరావు జయంతిని రాష్ట్ర అధికారిక కార్యక్రమంగా కూటమి ప్రభుత్వం ప్రకటించడాన్ని ఎన్టీఆర్ సతీమణి, వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందమూరి లక్ష్మీపార్వతి తీవ్రంగా తప్పుబట్టారు. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడవడంలో చంద్రబాబు నాయుడి పాత్ర ఎంత ఉందో, రామోజీరావు పాత్ర కూడా అంతే ఉందని ఆమె ధ్వజమెత్తారు. మోసాలు చేయడంలో వీరిద్దరూ గురుశిష్యులని తీవ్ర స్థాయిలో విమర్శించారు. అలాంటి వ్యక్తి జయంతిని రాష్ట్ర పండుగ చేస్తారా? అని చంద్రబాబును ఆమె సూటిగా ప్రశ్నించారు.

గురువుకు పండుగ.. మామకు ద్రోహం!

తన గురువు రామోజీరావు జయంతిని రాష్ట్ర పండుగలా నిర్వహించాలని ఉత్తర్వులు ఇచ్చిన చంద్రబాబు.. సొంత మామ ఎన్టీఆర్ విషయంలో మాత్రం భారతరత్న రాకుండా అడ్డుపడుతున్నారని లక్ష్మీపార్వతి మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్టీఆర్‌కు ద్రోహం చేసిన వారిని ప్రభుత్వం అధికారికంగా గౌరవించడం ఏమాత్రం సరికాదని ఆమె హితవు పలికారు.

'అక్వాన్' ముప్పుపై.. అప్రమత్తం!

నెల్లూరు-తుని మధ్య తీరం దాటే అవకాశం ఉందని అంచనా

ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు హోంమంత్రి ఆదేశం

కోస్తాంధ్రలో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులకు ఛాన్స్

మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దని హెచ్చరికలు



అమరావతి, నవంబర్ 17 (సమయం న్యూస్): బంగాళాఖాతంలో ఏర్పడిన అక్వాన్ తుపాన్ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పూర్తిగా అప్రమత్తమైంది. తీరప్రాంత జిల్లాల్లో తక్షణమే ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర హోంమంత్రి అనిత అధికారులను ఆదేశించారు. నెల్లూరుఉతుని మధ్య తుపాన్ తీరం దాటే అవకాశం ఉందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. గురు, శుక్రవారాల్లో కోస్తాంధ్రలో బలమైన ఈదురుగాలులతో పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు. ఈ నేపథ్యంలో తీరప్రాంత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు సమన్వయంతో పనిచేస్తూ ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని హోంమంత్రి సూచించారు. మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని, తీరప్రాంత ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటలను వర్షాలు, ఈదురుగాలుల నుంచి రక్షించుకునేలా రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. రానున్న నాలుగు రోజుల పాటు అన్ని శాఖలు పూర్తి సంసిద్ధతతో పనిచేయాలని హోంమంత్రి స్పష్టం చేశారు.

సంపాదకీయం



అభివృద్ధి అంకెల వెనుక.. అంతుచిక్కని సామాన్యుడి వ్యథ!

ఒకవైపు దేశ ఆర్థిక వ్యవస్థ శరవేగంగా దూసుకుపోతోందంటూ పాలకుల గొప్పలు.. ఇంకోవైపు కిరాణా కొట్టులో సరుకుల ధరలు చూసి గుండె గుభేల్మంటున్న సగటు మనిషి బతుకు! పత్రికల్లో అచ్చయ్యే ప్రగతి గణాంకాలకు, సామాన్యుడి ఇంట్లో నెలాఖరుకు మిగిలే చిల్లర పైసలకు మధ్య ఎక్కడా పొంతన కుదరని దుస్థితి ఇది. ఆకాశాన్ని అంటుతున్న ధరల మంటలో మధ్యతరగతి బతుకు నిశ్శబ్దంగా కాలిపోతోంది. నెల మొదటి రోజున చేతికొచ్చిన జీతం చూసి మురిసిపోవాలా.. లేక నెలాఖరు వరకు ఆ జీతంతో బండి ఎలా లాగాలన్న ఆందోళనతో కుమిలిపోవాలా అన్నది నేటి సామాన్య కుటుంబాల దయనీయ పరిస్థితి. ఒకప్పుడు కనీస అవసరాలు తీర్చుకుని భవిష్యత్తు కోసం కనీసం కొద్దిపాటైనా పొదుపు చేసుకునే కుటుంబాలు.. ఇప్పుడు ఏ ఖర్చును కోత కోసుకుంటే బతుకు బండి సాగుతుందోనని రోజూ లెక్కలు వేసుకుంటున్నాయి. కాగితాలపై కనిపిస్తున్న ఆర్థిక వికాసం నిజ జీవితంలో ఎందుకు సాక్షాత్కరించడం లేదన్నదే ఇప్పుడు సమాజాన్ని తొలుస్తున్న అతిపెద్ద ప్రశ్న.

గణాంకాలకే పరిమితమైన ప్రగతి..

నిత్యావసరాల ధరల పెరుగుదల తీవ్రత ఏ స్థాయిలో ఉందన్నది తాజా ప్రభుత్వ లెక్కలే స్పష్టం చేస్తున్నాయి. అక్టోబర్ 2026 నాటికి దేశ రిటైల్ ద్రవ్యోల్బణం 6.09 శాతానికి చేరుకోగా, ఆహార ద్రవ్యోల్బణం ఏకంగా 8.94 శాతంగా నమోదైంది. గత నెలతో పోలిస్తే ఇది అత్యంత ఆందోళనకరమైన పెరుగుదల. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో సామాన్య ద్రవ్యోల్బణం 6.63 శాతంగా ఉండటం పల్లె బతుకులపై పడుతున్న భారాన్ని కళ్లకు కడుతోంది. ఏసీ గదుల్లో కూర్చుని లెక్కలు కట్టే ఆర్థికవేత్తలకు ఈ శాతాలు సులువుగానే అర్థం కావొచ్చు. కానీ కూలీనాలీ చేసుకునే సామాన్యుడికి ఈ అంకెల గారడీతో పనేంటి? వంద రూపాయలు పట్టుకెళ్తే మార్కెట్‌లో కూరగాయల సంచి ఎందుకు నిండటం లేదన్నదే అతని అసలైన ఆవేదన. నెలకు సరిపడే సరుకులు పదిహేను రోజులకే ఎందుకు అడుగంటుతున్నాయి? పిల్లల చదువు, కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడీ, ఇంటి అద్దె, కరెంటు బిల్లు, ప్రయాణ ఖర్చులు, చేసిన అప్పులకు నెలవారీ వాయిదాలు చెల్లించిన తర్వాత.. చేతిలో చిల్లిగవ్వ ఎందుకు మిగలడం లేదు? అన్నదే అతను ప్రతిక్షణం అనుభవిస్తున్న నిజమైన ద్రవ్యోల్బణం.

ఆదాయం ఆవగింజ.. ఖర్చులు కొండంత!

ఉద్యోగికి వార్షిక వేతన పెంపు పేరుతో ఏటా కాస్తో కూస్తో జీతం పెరిగినా.. అదే సమయంలో నిత్యావసరాలు, విద్య, వైద్యం, రవాణా ఖర్చులు అంతకు మించి రెట్టింపు వేగంగా పెరిగితే ఆ పెంపునకు అర్థమేముంటుంది? అంకెల రూపంలో జీతం పెరగడం ముఖ్యం కాదు.. ఆ జీతంతో కొనగలిగే వస్తువుల పరిమాణం పెరగడమే నిజమైన ఆర్థిక భద్రత. నేటి మధ్యతరగతి కుటుంబాలు చదువు, వైద్యం లాంటి అత్యవసరాల కోసం చేసే ఖర్చు భరించలేక నానా అవస్థలు పడుతున్నాయి. ఏ చిన్న కష్టం వచ్చినా అప్పుల ఊబిలో కూరుకుపోవాల్సిన దుస్థితి నెలకొంది. పొదుపు అన్న పదం సామాన్యుడి నిఘంటువులో నుంచి శాశ్వతంగా కనుమరుగవుతోంది.

రైతుకు, వినియోగదారుడికి.. ఇద్దరికీ అన్యాయమే..

ధరల పెరుగుదలపై చర్చించేటప్పుడు దేశానికి అన్నం పెడుతున్న రైతును విస్మరించడం ఏమాత్రం సరికాదు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు రైతుకు కనీస గిట్టుబాటు ధర దక్కడం లేదు. అదే సమయంలో ఆ పంటను కొనుక్కుని తినే వినియోగదారుడికి సరసమైన ధరకు ఆహారం అందడం లేదు. వాస్తవానికి ఇక్కడ లాభపడుతున్నది కేవలం మధ్యవర్తులే. రైతు వద్ద అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి, అదే సరుకును వినియోగదారుడికి అమాంతం పెంచేసి విక్రయిస్తున్న దళారీ వ్యవస్థను అరికట్టడంలో ప్రభుత్వాలు దారుణంగా విఫలమవుతున్నాయి. మార్కెట్‌లో కృత్రిమ కొరత సృష్టించే అక్రమార్కులపై ఉక్కుపాదం మోపాలి. ధరలు ఆకాశాన్ని అంటిన తర్వాత ఉత్తుత్తి సమీక్షలు చేసి చేతులు దులుపుకోవడం కాదు.. ముందస్తుగానే ధరలను అదుపు చేసే పటిష్టమైన యంత్రాంగం కావాలి.


అసలైన అభివృద్ధి కొలమానం అదే..

లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి.. జీడీపీ అంకెలు పరుగులు తీస్తున్నాయి.. అన్న ప్రభుత్వాల ప్రకటనలు పైకి వినసొంపుగానే ఉండొచ్చు. కానీ నెల జీతం తీసుకునే ఓ సామాన్య కుటుంబం నెలాఖరుకు కనీసం కాస్తయినా మిగుల్చుకోగలుగుతోందా? అన్న ప్రశ్నకు పాలకుల వద్ద కచ్చితమైన సమాధానం ఉండాలి. ఆ సమాధానం ప్రతికూలంగా ఉంటే.. అసలు ఈ అభివృద్ధి ఫలాలు సమాజంలో ఎవరికి అందుతున్నాయన్న ప్రశ్న తలెత్తక మానదు. ప్రభుత్వాలు ధరల నియంత్రణను కేవలం ఒక ఆర్థిక విధానంగా మాత్రమే చూడకూడదు. దానిని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించాలి. సామాన్యుడి జీతం కాగితంపై ఎంత పెరిగిందన్నది కాదు.. ఆ వచ్చిన జీతంతో అతని కుటుంబం సమాజంలో ఎంత గౌరవంగా బతకగలుగుతోందా అన్నదే అసలు సిసలైన కొలమానం. పాలకుల దృష్టిలో బలమైన ఆర్థిక వ్యవస్థ అంటే కేవలం షేర్ మార్కెట్ లాభాలు కాదు.. అప్పుల్లేని బలమైన సామాన్య కుటుంబం అని ప్రభుత్వాలు గుర్తించినప్పుడే దేశంలో నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది

పోటీ కాదు.. సహకారమే మన భవిష్యత్తు!

- భారత్-ఆసియాన్ సదస్సులో ప్రధాని మోదీ పిలుపు
- ప్రపంచ జనాభాలో నాలుగో వంతుకు ప్రాతినిధ్యం
- శాంతి, స్థిరత్వం, సమృద్ధి అభివృద్ధే లక్ష్యం





మనీలా, నవంబర్ 17 (సమయం న్యూస్): భారత్–ఆసియాన్ దేశాల కూటమి కలిసి ప్రపంచ జనాభాలో దాదాపు నాలుగో వంతుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయని, కాబట్టి మన ఉమ్మడి భవిష్యత్తును కేవలం పోటీ కాకుండా పరస్పర సహకారమే నిర్దేశించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. మంగళవారం ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జరిగిన ఇండియా–ఆసియాన్ శిఖరాగ్ర సదస్సులో 11 సభ్య దేశాల నేతలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ భాగస్వామ్యంలో ఆసియాన్ ఐక్యత, దాని కీలక భూమికకు భారత్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. గడిచిన కొన్నేళ్లుగా ప్రపంచం వరుస సంక్షోభాలను ఎదుర్కొంటోందని, నేడు ప్రపంచానికి అత్యంత అవసరమైనది శాంతి, స్థిరత్వం, ఊహించదగిన భవిష్యత్తు అని అన్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది సదస్సు ప్రధాన ఇతివృత్తమైన 'నావిగేటింగ్ అవర్ ఫ్యూచర్, టుగెదర్' (మన భవిష్యత్తును సంయుక్తంగా మార్గనిర్దేశం చేసుకోవడం) అనే అంశానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. ఈ ప్రాంతాన్ని శాంతి, స్థిరత్వానికి చిహ్నంగా మార్చే శక్తి, సంకల్పం భారత్, ఆసియాన్ రెండింటికీ ఉన్నాయని ఆయన అన్నారు. భారతదేశ అభివృద్ధి, ఆసియాన్ శ్రేయస్సు ఒకదానితో ఒకటి లోతుగా ముడిపడి ఉన్నాయని మోదీ ఉద్ఘాటించారు. రాబోయే సంవత్సరాల్లో 'ఆసియాన్ కమ్యూనిటీ విజన్ 2045', 'వికసిత భారత్ 2047' లక్ష్యాలు మన ఉమ్మడి ఆకాంక్షలను నెరవేర్చడంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశం మన సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లడంతో పాటు, సురక్షితమైన, సమ్మిళిత, సంపన్నమైన ఇండో–పసిఫిక్ ప్రాంత నిర్మాణానికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 1967లో ఏర్పాటైన ఆసియాన్ కూటమి ఆగ్నేయాసియా దేశాల మధ్య ఆర్థిక వృద్ధి, రాజకీయ స్థిరత్వం, భద్రత, సాంస్కృతిక సహకారాన్ని ప్రోత్సహిస్తోంది. ప్రస్తుతం బ్రూనై, కంబోడియా, ఇండోనేషియా, లావోస్, మలేషియా, మయన్మార్, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్‌లాండ్, తైమూర్–లెస్టే, వియత్నాం సహా మొత్తం 11 దేశాలు ఇందులో సభ్య దేశాలుగా ఉన్నాయి.

వాళ్లు సైన్స్ తెలియని మూర్ఖులు

ఇథనాల్ బ్లెండింగ్‌పై కేంద్ర మంత్రి సురేశ్ గోపీ సంచలన వ్యాఖ్యలు

శాస్త్రీయ పరిశోధనల తర్వాతే ఈ20 విధానం అమలు

ఇథనాల్ మిశ్రమంపై దుష్ట రాజకీయాలు చేస్తున్నారని విమర్శ

అనుమానాలుంటే పెట్రోల్‌ను పరీక్షించుకోవచ్చని సవాల్



త్రిస్సూర్, నవంబర్ 17 (సమయం న్యూస్): పలు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సరఫరా చేస్తున్న పెట్రోల్‌లో ఇథనాల్ బ్లెండింగ్ (కలపడం) నిర్దేశిత 20 శాతం పరిమితిని మించుతోందంటూ వస్తున్న ఆరోపణలను కేంద్ర మంత్రి సురేశ్ గోపీ తీవ్రంగా ఖండించారు. అటువంటి నిరాధార ఆరోపణలు చేస్తున్న వారిని 'సైన్స్ తెలియని మూర్ఖులు'గా అభివర్ణించారు. కేరళలోని త్రిస్సూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పెట్రోల్ వాహనాల ద్వారా వెలువడే కాలుష్యాన్ని తగ్గించేందుకు ఇథనాల్‌ను కలపడం ఒక్కటే ప్రస్తుతం ఉన్న మార్గమని స్పష్టం చేశారు. విస్తృత శాస్త్రీయ పరిశోధనలు నిర్వహించిన అనంతరమే.. 'ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' (ూ=ూ×) ఆమోదంతో భారత్‌లో జు10 నుంచి జు20 ఇథనాల్ బ్లెండింగ్‌కు మారినట్లు సురేశ్ గోపీ గుర్తుచేశారు. ఇథనాల్ కలపడం వల్ల ఇంజిన్లు దెబ్బతిన్నాయని ఇప్పటివరకు ఎలాంటి బీమా (ఇన్సూరెన్స్) క్లెయిమ్‌లు రాలేదన్నారు. "ఇథనాల్ బ్లెండింగ్‌పై ప్రస్తుతం అనేక దుష్ట రాజకీయాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఇథనాల్ మిశ్రమం నిర్దేశిత పరిమితిని దాటిపోయిందనే తప్పుడు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి వాదనలు చేస్తున్నవారిలో ఎవరికీ సైన్స్ గురించి కనీస అవగాహన లేదు" అని ఆయన మండిపడ్డారు. పెట్రోల్‌లోని ఇథనాల్ శాతాన్ని ఎవరైనా, ఎప్పుడైనా పరీక్షించుకోవచ్చని, అలాంటి తనిఖీలను తాను ఏమాత్రం వ్యతిరేకించనని సురేశ్ గోపీ తెలిపారు. పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమం ఖచ్చితంగా 20 శాతానికి చేరుకోగానే, ఆటోమేటిక్‌గా వాల్వ్ ఆగిపోయేలా యంత్రాల సాంకేతిక వ్యవస్థ ఉంటుందని.. ఏ పెట్రోల్ బంకు నుంచైనా లభించే గరిష్ఠ ఇథనాల్ శాతం ఇదేనని ఆయన వివరించారు.

ఆటో డ్రైవర్‌గా బ్రిటన్ యువరాజు..

ప్రయాణికురాలిగా యువరాణి!

ముంబయిలో ప్రిన్స్ విలియం, కేట్ మిడిల్టన్ సందడి



ముంబయి, నవంబర్ 17 (సమయం న్యూస్): బ్రిటన్ యువరాజు ప్రిన్స్ విలియం, యువరాణి కేట్ మిడిల్టన్ ఆటోలో ప్రయాణించినట్లు వెలువడిన వార్త ఆసక్తికరంగా మారింది. భారత్ పర్యటనలో భాగంగా మంగళవారం ముంబయిలోని బాంద్రా రెక్లమేషన్ గార్డెన్‌ను సందర్శించిన రాజదంపతులు మహీంద్రా సంస్థకు చెందిన విద్యుత్ ఆటోలో ప్రయాణించినట్లు సమాచారం. ప్రిన్స్ విలియం స్వయంగా ఆటో నడపగా, కేట్ మిడిల్టన్ వెనుక సీటులో కూర్చున్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ఎర్త్‌షాట్ ప్రైజ్--2026కు ఎంపికైన తుది పోటీదారులతో సమావేశమయ్యారు. పర్యావరణ సమస్యలకు వినూత్నమైన, ఆచరణాత్మక పరిష్కారాలను ప్రోత్సహించేందుకు ప్రిన్స్ విలియం 2020లో ఎర్త్‌షాట్ ప్రైజ్‌ను ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, ప్రకృతి వనరుల సంరక్షణకు కృషి చేస్తున్న ఆవిష్కర్తలను ఈ పురస్కారం ద్వారా ప్రోత్సహిస్తారు. భారత్‌లో తొలిసారిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ వాహనాల వినియోగానికి ప్రాధాన్యం ఇస్తూ రాజదంపతులు ఆటోలో ప్రయాణించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచినట్లు కథనాలు వెల్లడించాయి.

దాడికి ముందే రెక్కీ..

సీసీ కెమెరాల్లో ఉగ్రవాదుల కదలికలు!

సీఆర్‌పీఎఫ్ బలగాలపై దాడికి ముందే పక్కాప్రణాళిక

ఎదురుకాల్పుల్లో ఉమర్ నిసార్ దార్ హతం

శ్రీనగర్, నవంబర్ 17 (సమయం న్యూస్): జమ్ముకశ్మీర్‌లో సీఆర్‌పీఎఫ్ బలగాలపై దాడికి పాల్పడిన ఉగ్రవాదులు ముందుగానే రెక్కీ నిర్వహించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. లష్కరే తోయిబా కమాండర్ మహమ్మద్ లతీఫ్ భట్, అతడి సహాయకుడు ఉమర్ నిసార్ దార్ దాడికి ముందు పలు ప్రాంతాల్లో అనుమానాస్పదంగా సంచరించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయని పోలీసులు గుర్తించారు. నవంబర్ 11న కుల్గామ్ జిల్లాలోని అఖ్రాన్ ప్రాంతంలో సీఆర్‌పీఎఫ్ చెక్‌పోస్ట్‌పై జరిగిన దాడికి ముందు రోజు వీరిద్దరూ రెక్కీ నిర్వహించినట్లు దర్యాప్తు అధికారులు వెల్లడించారు. నవంబర్ 10న లతీఫ్ భట్, ఉమర్ నిసార్ దార్ కలిసి మీర్‌బజార్, అఖ్రాన్, హబ్లిష్, కిలామ్ ప్రాంతాల్లో తిరిగినట్లు సీసీటీవీ దృశ్యాల ఆధారంగా గుర్తించారు. భద్రతా బలగాల కదలికలను పరిశీలించడంతోపాటు దాడికి అనువైన ప్రదేశాలను గుర్తించేందుకు వీరు రెక్కీ నిర్వహించినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. నవంబర్ 11న అఖ్రాన్ సీఆర్‌పీఎఫ్ చెక్‌పోస్ట్‌పై జరిపిన కాల్పుల్లో ముగ్గురు జవాన్లు గాయపడ్డారు. దాడి అనంతరం ఉగ్రవాదులు అక్కడి నుంచి పారిపోయిన దృశ్యాలు కూడా కెమెరాల్లో నమోదైనట్లు తెలిపారు. కాగా, నవంబర్ 16న కుల్గామ్ జిల్లాలో ఉగ్రవాదుల కదలికలను గుర్తించిన భద్రతా బలగాలు గాలింపు చేపట్టగా ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో ఉమర్ నిసార్ దార్ హతమయ్యాడని అధికారులు వెల్లడించారు. లష్కరే కమాండర్ లతీఫ్ భట్ మాత్రం గాయాలతో తప్పించుకున్నట్లు పేర్కొన్నారు. అతడిని పట్టుకునేందుకు భద్రతా బలగాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయి. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా ఉగ్రవాదుల కదలికలు, దాడి వెనుక ఉన్న ప్రణాళికపై దర్యాప్తు కొనసాగుతోంది.



గర్ల్‌ఫ్రెండ్‌తో కలిసి ఆ రెస్టారెంట్‌కు వెళ్లా!

అమ్మానాన్న తొలిసారి కలుసుకున్న చోటుకే ప్రేయసితో..

తన గత జ్ఞాపకాలను పంచుకున్న రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ, నవంబర్ 17 (సమయం న్యూస్): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ ఆసక్తికర జ్ఞాపకాన్ని పంచుకున్నారు. గతంలో తన ప్రేయసితో కలిసి బ్రిటన్‌లోని కేంబ్రిడ్జ్‌లో ఉన్న ఓ రెస్టారెంట్‌కు వెళ్లినట్లు వెల్లడించారు. ఆ రెస్టారెంట్‌లోనే తన తల్లిదండ్రులు రాజీవ్ గాంధీ, సోనియా గాంధీ తొలిసారి కలుసుకున్నారని తెలిపారు. సోనియా గాంధీ జీవిత విశేషాలకు సంబంధించిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకావిష్కరణ సందర్భంగా ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాహుల్ ఈ విషయాన్ని ప్రస్తావించారు. చాలా సంవత్సరాల క్రితం తన ప్రేయసితో కలిసి కేంబ్రిడ్జ్‌లోని ఓ రెస్టారెంట్‌కు వెళ్లానని, అక్కడికి వెళ్లే వరకు ఆ ప్రదేశానికి తన కుటుంబంతో ఉన్న అనుబంధం ఆమెకు తెలియదని రాహుల్ వివరించారు. రెస్టారెంట్‌కు వెళ్లిన తర్వాత తన తల్లిదండ్రులు తొలిసారి అక్కడే కలుసుకున్న విషయాన్ని ఆమెకు చెప్పినట్లు గుర్తుచేసుకున్నారు. అయితే ఆ ప్రేయసి ఎవరన్న విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. గతంలో రాహుల్ వ్యక్తిగత జీవితం, వివాహంపై అనేక ఊహాగానాలు వెలువడ్డాయి. 2004లో వెరోనిక్ అనే స్పెయిన్‌కు చెందిన మహిళ తనకు అత్యంత సన్నిహిత మిత్రురాలని రాహుల్ వెల్లడించినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. అయితే తాజా వ్యాఖ్యల్లో ప్రస్తావించిన వ్యక్తి ఆమెనేనా అన్న విషయంపై స్పష్టత లేదు. గతంలో పలువురితో రాహుల్ వివాహం జరగబోతోందంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగినప్పటికీ అవి ధ్రువీకరణకు నోచుకోలేదు. ఈ నేపథ్యంలో తన తల్లిదండ్రుల ప్రేమకథతో ముడిపడిన ఓ వ్యక్తిగత జ్ఞాపకాన్ని రాహుల్ పంచుకోవడం ఆసక్తికరంగా మారింది.

భోజనం వికటించి.. 40 మంది విద్యార్థులకు అస్వస్థత!

అనంతపురం జిల్లా గుమ్మగట్ట కేజీబీవీలో ఘటన

- రాత్రి భోజనంలో సాంబారు తిన్న అనంతరం వాంతులు
- ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్న అధికారులు
- విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై మంత్రి సత్యకుమార్ ఆరా
- పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశం



అనంతపురం, నవంబర్ 17 (సమయం న్యూస్): అనంతపురం జిల్లా గుమ్మగట్ట కేజీబీవీలో రాత్రి భోజనం వికటించి సుమారు 40 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. రాత్రి భోజనంలో సాంబారు తిన్న అనంతరం విద్యార్థులు వాంతులు, కడుపునొప్పితో అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్రంగా స్పందించారు. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఆర్.వెంకటరమణ, జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అస్వస్థతకు గురైన వారిలో నలుగురు విద్యార్థులను మెరుగైన వైద్యం కోసం గుమ్మగట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మిగిలిన విద్యార్థులకు వసతి గృహంలోనే వైద్య బృందాలతో అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. ప్రస్తుతం విద్యార్థులందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని అధికారులు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఆ పాఠశాలలో తక్షణమే ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు.



నాయకత్వమే.. ఒక మిషన్!

ప్రధాని మోదీ 25 ఏళ్ల పాలనపై నీతి ఆయోగ్ జాతీయ వర్క్‌షాప్

దృఢమైన నాయకత్వంతోనే ప్రజల జీవితాల్లో మార్పు సాధ్యం

నాయకత్వ లక్షణాలపై వివరించిన ప్రధాని ప్రధాన కార్యదర్శి మిశ్రా

భవిష్యత్ సివిల్ సర్వీసెస్ శిక్షణలో ఈ అనుభవాల వినియోగం

న్యూఢిల్లీ, నవంబర్ 17 (సమయం న్యూస్): ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ అధినేతగా పాతికేళ్లు (25 ఏళ్లు) పూర్తి చేసుకున్న సందర్భంగా నీతి ఆయోగ్ 'నాయకత్వం ఒక మిషన్' (లీడర్‌షిప్ యాజ్ ఏ మిషన్) అనే అంశంపై తొలి జాతీయ వర్క్‌షాప్ నిర్వహించింది. ఈ వర్క్‌షాప్‌లో ప్రధాని ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.కె.మిశ్రా మాట్లాడుతూ.. దృఢమైన నాయకత్వం, సమర్థవంతమైన పరిపాలనతో మాత్రమే ప్రజల జీవితాల్లో ఆశించిన మార్పు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సేవా దృక్పథం, లక్ష్య సాధన, బలమైన సంస్థల నిర్మాణం అనేవి ఉత్తమ నాయకత్వానికి కీలకమని నీతి ఆయోగ్ సీఈవో అనురాగ్ జైన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ ప్రతిష్టాత్మక వర్క్‌షాప్‌లో 900 మందికి పైగా అధికారులు, విద్యావేత్తలు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సదస్సు ద్వారా నేర్చుకున్న నాయకత్వ అనుభవాలను భవిష్యత్ సివిల్ సర్వీసెస్ శిక్షణకు, వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనకు ఉపయోగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

స్మార్ట్‌ఫోన్లతో సత్తా చాటుతున్నాం!

ఏప్రిల్-సెప్టెంబర్‌లో ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల్లో 44 శాతం వృద్ధి

31.97 బిలియన్ డాలర్లకు చేరిన వస్తువుల ఎగుమతులు

స్మార్ట్‌ఫోన్ల ఎగుమతుల్లో ఏకంగా 35.8 శాతం వృద్ధి నమోదు

మెమరీ చిప్‌లు, పీసీబీల ఎగుమతుల్లోనూ భారీ పెరుగుదల



న్యూఢిల్లీ, నవంబర్ 17 (సమయం న్యూస్): ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగుమతుల్లో భారత్ సత్తా చాటుతోంది. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్ల తయారీ, ఎగుమతుల్లో మన దేశం గణనీయమైన వృద్ధి సాధిస్తోంది. 2026-27 ఆర్థిక సంవత్సరంలోని తొలి ఆరు నెలల్లో (ఏప్రిల్ఉసెప్టెంబర్) ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగుమతులు ఏకంగా 44 శాతం మేర పెరిగి 31.97 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఇందులో స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు 35.8 శాతం మేర పెరిగి 18.17 బిలియన్ డాలర్లకు చేరుకోవడం విశేషం. ఇక స్మార్ట్‌ఫోన్లేతర ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు కూడా 56.5 శాతం వృద్ధితో 13.79 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. వీటితో పాటుగా పీసీబీలు, నెట్‌వర్క్ పరికరాలు, మెమరీ చిప్‌లు, స్టోరేజ్ పరికరాల ఎగుమతుల్లోనూ భారీ వృద్ధి నమోదైనట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

భార్యను కొడుతున్నాడని.. అడ్డుబోయిన కొడుకును!

కర్ణాటకలోని కునిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం

మద్యం మత్తులో భార్యపై దాడికి దిగిన కసాయి భర్త

అడ్డుకునేందుకు వచ్చిన 16 ఏళ్ల కొడుకు కొట్టివేత

నిందితుడిని పోలీస్ జీపులోంచి లాగి చితకబాదిన గ్రామస్తులు

స్పృహ కోల్పోవడంతో ఆస్పత్రికి తరలించిన పోలీసులు

తుమకూరు, నవంబర్ 17 (సమయం న్యూస్): తల్లిని కొడుతున్న తండ్రిని అడ్డుకునేందుకు వెళ్లిన ఓ 16 ఏళ్ల బాలుడు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన కర్ణాటకలో చోటుచేసుకుంది. తుమకూరు జిల్లా కునిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చౌదనాయకనపాళ్యలో ఈ దారుణం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ గ్రామానికి చెందిన నంజేగౌడ (50) మద్యానికి బానిసయ్యాడు. రోజూ మద్యం తాగి వచ్చి తరచూ భార్య రజితతో గొడవపడుతూ ఆమెను తీవ్రంగా కొట్టేవాడు. ఇదే క్రమంలో ఆదివారం ఉదయం కూడా పీకలదాకా మద్యం తాగి వచ్చి భార్యపై దాడికి దిగాడు. తల్లిని తండ్రి విచక్షణారహితంగా కొడుతుండటం చూసిన 16 ఏళ్ల కుమారుడు సునీల్.. ఆమెను రక్షించేందుకు అడ్డుకునే ప్రయత్నం చేశాడు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన నంజేగౌడ.. భార్యను ఇంటి నుంచి బయటకు నెట్టేసి లోపల గడియ పెట్టుకున్నాడు. అనంతరం కుమారుడిని తీవ్రంగా కొట్టి చంపాడు. ఈ ఘటనతో స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. భర్త ఘాతుకంపై భార్య ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు నిందితుడు నంజేగౌడను అరెస్ట్ చేసేందుకు ఇంటికి చేరుకున్నారు. ఇంట్లో ఉన్న అతడిని పట్టుకుని పోలీసులు జీపులోకి ఎక్కించగానే.. ఆగ్రహంతో రగిలిపోతున్న స్థానికులు అతడిని జీపులో నుంచి బలవంతంగా బయటకు లాగారు. కన్న కొడుకునే కడతేర్చిన ఆ కసాయి తండ్రిని కర్రలతో తీవ్రంగా చితకబాదారు. ప్రజల దాడిలో తీవ్రంగా గాయపడిన నంజేగౌడ అక్కడికక్కడే స్పృహ కోల్పోయాడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు అతికష్టం మీద జనాన్ని చెదరగొట్టి, అతడిని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భారత్-ఫిజీ బంధానికి.. కొత్త ముందడుగు!

- ఫిజీ అధికారులకు గ్లోబల్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్ ప్రారంభం
- శిక్షణ ఇస్తున్న భారత డిఫెన్స్ హెడ్‌క్వార్టర్స్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్
- సువాలో తొలి దశ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఫిజీ రక్షణ మంత్రి
- సుపరిపాలన, రక్షణ కొనుగోళ్లు, ఏఐ ఆధారిత పరివర్తనపై శిక్షణ
- 2027లో న్యూఢిల్లీ వేదికగా రెండో దశ కార్యక్రమం



న్యూఢిల్లీ, నవంబర్ 17 (సమయం న్యూస్): రక్షణ, ప్రజా పరిపాలనలో ఫిజీ అధికారుల సామర్థ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో భారత రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన డిఫెన్స్ హెడ్‌క్వార్టర్స్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ తొలిసారిగా గ్లోబల్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. నాలుగు వారాల పాటు సాగే ఈ కార్యక్రమం తొలి దశ నవంబర్ 16 నుంచి 27 వరకు ఫిజీలోని సువాలో జరుగుతోంది. ఫిజీ రక్షణ, వెటరన్ అఫైర్స్ మంత్రి పియో టికోడుడువా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణ ఫిజీలో సంస్థాగత సామర్థ్యాన్ని బలోపేతం చేయడంలో ఎంతగానో సహాయపడుతుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. భారత్ఉఫిజీ మధ్య పెరుగుతున్న సన్నిహిత భాగస్వామ్యానికి ఈ కార్యక్రమం ప్రతీకగా నిలుస్తుందని ఫిజీలో భారత హైకమిషనర్ సునీత్ మెహతా తెలిపారు.

ఏయే అంశాలపై శిక్షణ అంటే..

ఈ లీడర్‌షిప్ ప్రోగ్రామ్‌లో సుపరిపాలన, రక్షణ కొనుగోళ్లు, పరిపాలనా చట్టం, నైతిక పాలన, మానవ వనరుల అభివృద్ధి, ఆడిట్ వ్యవస్థ ఆధునికీకరణ, ఏఐ ఆధారిత డిజిటల్ పరివర్తన, వ్యూహాత్మక కమ్యూనికేషన్, నాయకత్వం తదితర అంశాలను అధికారులకు బోధిస్తున్నారు. ఈ కార్యక్రమం రెండో దశను 2027 తొలి త్రైమాసికంలో రెండు వారాల పాటు న్యూఢిల్లీలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఫిజీ అధికారుల్లో సామర్థ్య నిర్మాణంతో పాటు ఇరు దేశాల ద్వైపాక్షిక రక్షణ సహకారం భవిష్యత్తులో మరింత బలోపేతం కానుందని అధికారులు వెల్లడించారు.



రియల్టర్లపై.. 'రెరా' కొరడా!

నిబంధనలు ఉల్లంఘించిన పలు సంస్థలపై కీలక ఆదేశాలు

సనాలి ఐటీ పార్క్‌కు రూ.25 లక్షల భారీ జరిమానా

కొనుగోలుదారులకు వడ్డీతో సహా డబ్బులు చెల్లించాలని ఆదేశం

మియాపూర్‌లో తక్షణమే ప్లాట్ అప్పగించాలని సూచన

ఆదేశాలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

హైదరాబాద్, నవంబర్ 17 (సమయం న్యూస్): నిబంధనలు ఉల్లంఘిస్తూ కొనుగోలుదారులను మోసగిస్తున్న పలు రియల్ ఎస్టేట్ సంస్థలపై తెలంగాణ రెరా కొరడా ఝుళిపించింది. ఈ మేరకు ఆయా సంస్థలపై కీలక ఆదేశాలు జారీ చేసింది. మంచిరేవులలో రిజిస్ట్రేషన్ లేకుండానే 'సనాలి ది ఎడ్జ్' ప్రాజెక్టును విక్రయించిన సనాలి ఐటీ పార్క్‌కు ఏకంగా రూ.25 లక్షల జరిమానా విధించింది. అలాగే శ్రీ ఆదిత్య స్క్వేర్స్ రూ.17 లక్షలు, త్రిపుర కన్‌స్ట్రక్షన్స్ రూ.41.85 లక్షలు, ఎస్‌వీఎం ఆదిత్య హోమ్స్ రూ.27.16 లక్షలను వడ్డీతో సహా కొనుగోలుదారులకు తిరిగి చెల్లించాలని రెరా ఆదేశించింది. వాసవి రియల్టర్స్ రూ.49.50 లక్షలపై ఏడాదికి 10.85 శాతం వడ్డీ చెల్లించాలని స్పష్టం చేసింది. మియాపూర్‌లోని అరైన్ ఎమరాల్డ్‌లో ఫ్లాట్ నంబర్ 502ను కొనుగోలుదారుడికి తక్షణమే అప్పగించాలని అరైన్ ఇన్‌ఫ్రాకు సూచించింది. అదేవిధంగా బీవీఆర్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ రూ.7 లక్షలు, భువంతేజ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ రూ.26 లక్షలను వడ్డీతో సహా బాధితులకు తిరిగి చెల్లించాలని ఆదేశించింది. ఒకవేళ ఈ ఆదేశాలను పాటించకపోతే రెరా చట్టంలోని సెక్షన్ 63 ప్రకారం సంబంధిత సంస్థలపై అదనపు జరిమానాలు, కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ రెరా హెచ్చరించింది.

నవంబర్ 18న.. ప్రకృతి వైద్య దినోత్సవం!

'ప్రకృతిక్ చికిత్సఉస్వస్థ భారత్' ఇతివృత్తంతో కార్యక్రమాలు

కర్ణాటకలోని నాగమంగళలో జరగనున్న ప్రధాన వేడుక

ఆరోగ్య సంరక్షణ, జీవనశైలి వ్యాధులపై ప్రజలకు అవగాహన

న్యూఢిల్లీ, నవంబర్ 17 (సమయం న్యూస్): "ప్రకృతిక్ చికిత్సఉస్వస్థ భారత్" ఇతివృత్తంతో నవంబర్ 18వ తేదీన దేశవ్యాప్తంగా 9వ ప్రకృతి వైద్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయుష్ మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రకృతి వైద్యం ద్వారా కలిగే ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమాన్ని ఏటా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కర్ణాటకలోని నాగమంగళలో ఈ దినోత్సవ ప్రధాన కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా నివారణాత్మక ఆరోగ్య సంరక్షణ, పెరుగుతున్న స్థూలకాయం సమస్య, జీవనశైలి వ్యాధుల నివారణపై నిపుణులు ప్రజలకు అవగాహన కల్పించనున్నారు.





నిష్పక్షపాతంగా.. స్థానిక ఎన్నికలు!

పటిష్ట భద్రత మధ్య రెండో విడత స్థానిక సంస్థల పోలింగ్

ఎన్నికల సంఘం మార్గదర్శకాలతో ముందస్తు చర్యలు

స్వేచ్ఛగా ఓటు వేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా పకడ్బందీ ఏర్పాట్లు

3 రోజుల్లో ఐదు వేల మందికి పైగా వ్యక్తుల బైండ్ ఓవర్

వివరాలు వెల్లడించిన పోలీస్ ఐజీ బి.రాజకుమారి

అమరావతి, నవంబర్ 17 (సమయం న్యూస్): రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) మార్గదర్శకత్వంలో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా రెండో విడత సాధారణ స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు విస్తృతమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు పోలీస్ ఐజీ బి.రాజకుమారి తెలిపారు. మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ శాఖ అన్ని ముందస్తు భద్రతా చర్యలు కట్టుదిట్టంగా అమలు చేస్తోందని ఐజీ స్పష్టం చేశారు.

భారీగా బైండ్ ఓవర్లు..

నవంబర్ 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు మూడు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ శాఖ చేపట్టిన శాంతిభద్రతల పరిరక్షణ చర్యలు, నమోదు చేసిన కేసుల వివరాలను ఐజీ రాజకుమారి వెల్లడించారు. ఈ మూడు రోజుల్లో 24 ఎఫ్ఐఆర్లు నమోదు చేసినట్లు తెలిపారు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్లు 126/129 కింద 722 కేసులు నమోదు చేసి, ఏకంగా 5,327 మందిని బైండ్ ఓవర్ చేసినట్లు ఆమె వివరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) ఉల్లంఘన కింద 444 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. అక్రమంగా తరలిస్తున్న 200.55 లీటర్ల మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారని ఐజీ వెల్లడించారు.

యూపీఐ.. రికార్డుల మోత!

తొలిసారిగా రూ.30 లక్షల కోట్లు దాటిన చెల్లింపులు

అక్టోబర్‌లో 2,547 కోట్ల లావాదేవీలు

మొత్తం లావాదేవీల విలువ రూ.31.53 లక్షల కోట్లు

రోజువారీ సగటు విలువ లక్ష కోట్లు క్రాస్

దీపావళికి ఒకే రోజు 97 కోట్లకు పైగా ట్రాన్సాక్షన్స్



హైదరాబాద్, నవంబర్ 17 (సమయం న్యూస్): దేశంలో డిజిటల్ చెల్లింపుల వినియోగం కొత్త శిఖరాలకు చేరుతోంది. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా 2026 అక్టోబర్‌లో రికార్డు స్థాయిలో లావాదేవీలు జరిగాయి. నెలవారీ చెల్లింపుల విలువ తొలిసారిగా రూ.30 లక్షల కోట్లను అధిగమించి ఏకంగా రూ.31.53 లక్షల కోట్లకు చేరింది. నెల్లో మొత్తం 2,547 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) వెల్లడించిన గణాంకాల ప్రకారం గతేడాది అక్టోబర్‌తో పోలిస్తే లావాదేవీల సంఖ్య 23 శాతం, విలువ 16 శాతం పెరిగాయి. పండుగ కొనుగోళ్లు, ఆన్‌లైన్ విక్రయాలు, రోజువారీ చెల్లింపులు ఈ వృద్ధికి దోహదపడ్డాయి. ఈ ఏడాది మే నెలలో నమోదైన రూ.29.90 లక్షల కోట్ల గత రికార్డును అక్టోబర్ లావాదేవీలు అధిగమించాయి.

రోజువారీ సగటు లక్ష కోట్లు దాటింది..

సెప్టెంబర్‌తో పోలిస్తే అక్టోబర్‌లో రోజువారీ లావాదేవీల సంఖ్యతో పాటు చెల్లింపుల విలువ కూడా పెరిగింది. సెప్టెంబర్‌లో రోజుకు సగటున 80.2 కోట్ల లావాదేవీల ద్వారా రూ.97,913 కోట్ల చెల్లింపులు జరగ్గా.. అక్టోబర్‌లో ఈ సంఖ్య 82.2 కోట్లకు చేరింది. రోజువారీ చెల్లింపుల సగటు విలువ ఏకంగా రూ.1,01,707 కోట్లుగా నమోదైంది. దీంతో సగటు రోజువారీ లావాదేవీల విలువ తొలిసారిగా లక్ష కోట్ల రూపాయల మైలురాయిని దాటింది. దీపావళి సందర్భంగా యూపీఐ చెల్లింపులు భారీగా నమోదయ్యాయి. పండుగ కొనుగోళ్లు, నగదు బదిలీలు, చివరి నిమిషపు చెల్లింపులతో నవంబర్ 7న ఒక్కరోజే 97.58 కోట్ల లావాదేవీలు జరిగాయి. వీటి విలువ రూ.1,36,118 కోట్లుగా నమోదైంది. దీపావళి రోజైన నవంబర్ 8న 91.69 కోట్ల లావాదేవీల ద్వారా రూ.90,029.43 కోట్ల చెల్లింపులు జరిగినట్లు ఎన్‌పీసీఐ వెల్లడించింది.

మోదీ.. 'టఫ్ మ్యాన్'

- **భారత ప్రధానిపై అమెరికా అధ్యక్షుడి ప్రశంసల జల్లు**
- **సమర్థవంతమైన నాయకుడంటూ మోదీకి ట్రంప్ కితాబు**
- **మనీలాలో క్వాడ్ దేశాధినేతల సమావేశంలో ప్రస్తావన**
- **కిందపడిన జాతీయ జెండా గుర్తును జేబులో పెట్టుకున్న మోదీ**
- **ప్రధాని దేశభక్తిపై సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో**
- **అరుదైన ఖనిజాల ఉత్పత్తిలో పరస్పర సహకారానికి పిలుపు**



మనీలా, నవంబర్ 17 (సమయం న్యూస్) : ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జరుగుతున్న ఆసియాన్-2026 సదస్సు సందర్భంగా క్వాడ్ దేశాధినేతలు సమావేశమయ్యారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్ర మోదీతో పాటు ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్, జపాన్ ప్రధాని సనాయే తకైచి ఈ ప్రతిష్టాత్మక భేటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ మరోసారి ప్రధాని మోదీపై ప్రశంసల జల్లు కురిపించారు. ఆయనను 'టఫ్ మ్యాన్' (కఠినమైన వ్యక్తి)గా అభివర్ణిస్తూ, ఎంతో సమర్థవంతమైన నాయకుడని కొనియాడారు. మోదీ పక్కనే నిలబడి ఉన్న సమయంలో ట్రంప్ ఆయనను చూపిస్తూ 'కఠినమైన వ్యక్తి' అని వ్యాఖ్యానించారు. అనంతరం జపాన్ ప్రధాని సనాయే తకైచిని ప్రస్తావిస్తూ.. ఆమె బహుశా అంతకంటే కఠినమైన నాయకురాలు కావచ్చని సరదాగా అన్నారు. మోదీ తనకు చాలా మంచి మిత్రుడని, ఆయన నాయకత్వ సామర్థ్యం తనకు తెలుసని ట్రంప్ పేర్కొన్నారు.

జెండాపై మోదీకి ఎంత గౌరవమో..

క్వాడ్ దేశాధినేతల సమావేశంలో గ్రూప్ ఫొటో దిగే సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ఓ చిన్న పని ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. క్వాడ్ నేతలు గ్రూప్ ఫొటో దిగేందుకు వేదికపై నిలబడాల్సిన స్థానాలను సూచిస్తూ ఆయా దేశాల జాతీయ జెండాల గుర్తులతో కూడిన కార్డులను కింద ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో భారత జెండా గుర్తు ఉన్న కార్డు నేలపై పడిపోవడాన్ని మోదీ గమనించారు. వెంటనే వంగి ఆ కార్డును తీసుకుని దులుపుకుని తన జేబులో భద్రంగా పెట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. జాతీయ జెండా గుర్తును నేలపై వదిలేయకుండా ఆయన చూపిన శ్రద్ధ పలువురి దృష్టిని ఆకర్షించింది. తన జాతీయ జెండా పట్ల ప్రధానికి ఉన్న గౌరవాన్ని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.

అరుదైన ఖనిజాల ఉత్పత్తిపై చర్చ..

ఈ సమావేశంలో శాంతి, స్థిరత్వం, ఇండో-పసిఫిక్ ప్రాంత భద్రత వంటి అంశాలపై క్వాడ్ నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సముద్ర భద్రతను బలోపేతం చేయడం, సరఫరా వ్యవస్థలను పటిష్ఠం చేయడం, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడం, విపత్తుల నిర్వహణ వంటి కీలక రంగాల్లో క్వాడ్ దేశాలు కలిసి పనిచేయాలని మోదీ సూచించారు. క్వాడ్ కూటమి విశ్వసనీయమైన, నిర్ణయాత్మక భాగస్వామ్యంగా ఎదిగిందని ఆయన అన్నారు. ప్రాంతీయ స్థిరత్వం, భద్రతకు ఈ కూటమి మరింత కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా అరుదైన ఖనిజాల ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను బలోపేతం చేసేందుకు సభ్యదేశాల మధ్య సహకారం పెరగాల్సిన అవసరాన్ని ట్రంప్ ప్రస్తావించారు. ఈ రంగంలో అమెరికా, భారత్, జపాన్ ఇప్పటికే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయని తెలిపారు. అరుదైన ఖనిజాల ఉత్పత్తిలో అమెరికా భారీగా ముందుకు సాగుతోందని, మరో పది నెలల్లో తమ దేశానికి అవసరమైన ఖనిజాలన్నీ అందుబాటులోకి వస్తాయని ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. జపాన్, భారత్ కూడా ఈ దిశగా కృషి చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. కాగా, 2024 సెప్టెంబర్‌లో అమెరికాలోని డెలావేర్‌లో క్వాడ్ దేశాధినేతలు చివరిసారిగా సమావేశమయ్యారు. రెండేళ్ల విరామం తర్వాత తాజాగా మనీలాలో మరోసారి భేటీ కావడం గమనార్హం

విలీన పంచాయితీల పిటిషన్లపై.. విచారణ వాయిదా

- **ఏపీలోని పలు మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో గ్రామాల విలీనం**
- **దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ**
- **మున్సిపల్ సవరణ చట్టం-2021 రాజ్యాంగబద్ధతను పరిశీలిస్తామన్న ధర్మాసనం**
- **కేసు తదుపరి విచారణ ఈ నెల 25వ తేదీకి వాయిదా**



న్యూఢిల్లీ, నవంబర్ 17 (సమయం న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని గ్రామ పంచాయతీలను సమీప మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో విలీనం చేసిన వ్యవహారంలో దాఖలైన పిటిషన్లపై విచారణను సుప్రీంకోర్టు ఈ నెల 25వ తేదీకి వాయిదా వేసింది. ఏపీ ప్రభుత్వం చేపట్టిన విలీన ప్రక్రియను సవాలు చేస్తూ పలు ప్రాంతాల నుంచి పిటిషన్లు దాఖలయ్యాయి. ప్రధానంగా.. పొన్నూరు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, కందుకూరు, భీమవరం, గూడూరు, గుడివాడ మున్సిపాలిటీలతో పాటు శ్రీకాకుళం, రాజమహేంద్రవరం కార్పొరేషన్లు, రాజానగరం అప్‌గ్రేడ్ (మున్సిపాలిటీగా) పరిధిలోని గ్రామాల నుంచి ఈ పిటిషన్లు సుప్రీంకోర్టుకు చేరాయి.

అవి మంగళవారం జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చాయి. వాదనలు విన్న న్యాయస్థానం.. ఏపీ మున్సిపల్ చట్టాల (సవరణ) చట్టం-2021 రాజ్యాంగబద్ధతను తాము పరిశీలిస్తామని వెల్లడించింది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణను ఈ నెల 25వ తేదీకి వాయిదా వేసింది.

కేజ్రీవాల్, ఆప్ నేతలపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం!

- **కోర్టు ధిక్కరణ కేసులో సమాధానాలు ఇవ్వకపోవడంపై ఫైర్**
- **మమ్మల్ని ఆటపట్టిస్తున్నారా? అంటూ ధర్మాసనం మండిపాటు**
- **సమాధానాలు దాఖలు చేసేందుకు మూడు వారాల గడువు**
- **లేకపోతే వాదనలు వినిపించే హక్కు కోల్పోతారని హెచ్చరిక**
- **ఢిల్లీ మద్యం విధానం కేసు తీర్పు, సామాజిక మాధ్యమాల్లో వ్యాఖ్యల నేపథ్యంలో చర్యలు**

న్యూఢిల్లీ, నవంబర్ 17 (సమయం న్యూస్) : ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు ఆ పార్టీకి చెందిన పలువురు నేతలపై ఢిల్లీ హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కరణ కేసులో ఇప్పటివరకు సరైన సమాధానాలు దాఖలు చేయకపోవడంపై న్యాయస్థానం తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇకపై ఏమాత్రం గడువు పొడిగించేది లేదని స్పష్టం చేస్తూ.. సమాధానాలు ఇచ్చేందుకు చివరిసారిగా మూడు వారాల సమయం ఇస్తున్నట్లు ప్రకటించింది. ఈలోగా సమాధానాలు సమర్పించకపోతే తమ వాదనలు వినిపించే హక్కును శాశ్వతంగా కోల్పోతారని తీవ్రంగా హెచ్చరించింది.

అసలేం జరిగిందంటే..

ఢిల్లీ మద్యం విధానం కేసులో కేజ్రీవాల్, మనీష్ సిసోడియా తదితర నిందితులను ట్రయల్ కోర్టు నిర్దోషులుగా విడుదల చేసింది. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సీబీఐ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌ను జస్టిస్ స్వర్ణకాంత శర్మ విచారిస్తున్న సమయంలో.. కేజ్రీవాల్, సిసోడియా తదితరులు ఆమె విచారణ నుంచి తప్పుకోవాలని కోరుతూ పిటిషన్లు దాఖలు చేశారు. అయితే న్యాయమూర్తి ఆ అభ్యర్థనలను నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. దీంతో కేజ్రీవాల్, సిసోడియా తదితరులు ఆమె ఎదుట వ్యక్తిగతంగా లేదా న్యాయవాదుల ద్వారా కూడా హాజరుకాబోమని లేఖలు రాశారు. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మపై సామాజిక మాధ్యమాల్లో చేసిన వ్యాఖ్యలు, పోస్టులు, వీడియోల నేపథ్యంలో వారిపై కోర్టు ధిక్కరణ చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ కోర్టు ధిక్కరణ వ్యవహారంలో అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, ఆప్ నేతలు సౌరభ్ భరద్వాజ్, సంజయ్ సింగ్, దుర్గేశ్ పాఠక్, వినయ్ మిశ్రా, దేవేష్ విశ్వకర్మ తదితరులు ఉన్నారు. ఈ కేసు విచారణ సందర్భంగా జస్టిస్ నవీన్ చావ్లా, జస్టిస్ అరుణ్ భరద్వాజ్‌లతో కూడిన ధర్మాసనం ఆప్ నేతల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. కేసుకు సంబంధించిన పత్రాలు అందలేదని నేతల తరఫు న్యాయవాదులు ధర్మాసనానికి చెప్పారు. అయితే రిజిస్ట్రీ నుంచి అందిన నివేదిక ప్రకారం అవసరమైన పత్రాల పంపిణీ పూర్తయిందని న్యాయమూర్తులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా న్యాయస్థానం.. 'మమ్మల్ని ఆటపట్టిస్తున్నారా? ఇకపై మీకు అదనపు సమయం ఇవ్వబోం. ఇప్పుడే సమాధానాలు దాఖలు చేయండి. లేకపోతే ఆ హక్కును మూసివేస్తాం' అంటూ ఆప్ నేతలను తీవ్రంగా హెచ్చరించింది.



లక్నో గూటికి సామ్ కర్రన్ ఢిల్లీ జట్టులో భారీ ప్రక్షాళన!


- ఐపీఎల్ 2027 మినీ వేలానికి ముందు కీలక మార్పులు
- రూ.2.4 కోట్లకు లక్నోకు సామ్ కర్రన్ బదిలీ
- రాజస్థాన్ రాయల్స్‌కు షమీ, ఎం.సిద్ధార్థ్
- నితీశ్ రాణా, నిస్సాంక, డకెట్‌లకు ఢిల్లీ గుడ్‌బై
- రూ.29 కోట్లతో మినీ వేలానికి ఢిల్లీ సిద్ధమవుతున్నట్లు సమాచారం



న్యూఢిల్లీ, నవంబర్ 17 (సమయం న్యూస్): ఐపీఎల్ 2027 మినీ వేలానికి ముందు అన్ని ఫ్రాంచైజీలు తమ జట్లను సమూలంగా ప్రక్షాళన చేసే పనిలో నిమగ్నమయ్యాయి. ఆటగాళ్ల రిటెన్షన్ గడువు ముగియడంతో ట్రేడింగ్ విండోలో పలు కీలక ఒప్పందాలు, సంచలన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇందులో భాగంగా రాజస్థాన్ రాయల్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్ల మధ్య ఆసక్తికరమైన ట్రేడ్ జరిగింది. రాజస్థాన్ స్టార్ ఆల్‌రౌండర్ సామ్ కర్రన్‌ను తన పాత ధర రూ. 2.4 కోట్లకు లక్నో సూపర్ జెయింట్స్ సొంతం చేసుకుంది. ఇదే క్రమంలో లక్నో నుంచి సీనియర్ పేసర్ మహ్మద్ షమీ (రూ. 8 కోట్లు), ఎడమచేతి వాటం స్పిన్నర్ ఎం. సిద్ధార్థ్ (రూ. 75 లక్షలు) రాజస్థాన్ రాయల్స్ గూటికి చేరారు. లక్నోకు కొత్త బలం.. కెప్టెన్సీ ఆప్షన్‌గా సామ్ కర్రన్:ఐపీఎల్ కెరీర్‌లో ఇప్పటివరకు 59 వికెట్లు పడగొట్టడంతో పాటు 997 పరుగులు సాధించిన సామ్ కర్రన్, 2022 టీ20 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ విజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించాడు. స్టార్ వికెట్ కీపర్ రిషబ్ పంత్ తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్‌కు వెళ్లిపోవడంతో, కర్రన్ రాక లక్నో మిడిల్ ఆర్డర్‌కు బలాన్నివ్వడమే కాకుండా కెప్టెన్సీ ఆప్షన్‌గానూ ఉపయోగపడనుంది. గత సీజన్‌లో గాయం కారణంగా దూరమైన కర్రన్, 2027 సీజన్‌లో లక్నో తరఫున బ్యాట్, బంతితో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నాడు.

ఢిల్లీ క్యాపిటల్స్ ప్రక్షాళన.. రూ. 29 కోట్ల పర్స్‌తో వేలంలోకి:

మరోవైపు ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు తమ ఆటగాళ్ల జాబితాలో భారీ మార్పులు చేసింది. గత సీజన్‌లో రాజస్థాన్ నుంచి రూ. 4.2 కోట్లకు ట్రేడింగ్ ద్వారా వచ్చిన నితీశ్ రాణా 9 ఇన్నింగ్స్‌లలో కేవలం 225 పరుగులే చేసి నిరాశపరచడంతో అతడిని వదులుకుంది. అలాగే ఓపెనర్‌గా 10 ఇన్నింగ్స్‌లలో 278 పరుగులు చేసిన పాతుమ్ నిస్సాంకతో పాటు, టెస్టు క్రికెట్‌కు ప్రాధాన్యత ఇస్తూ గత సీజన్‌కు దూరమైన బెన్ డకెట్‌ను కూడా ఢిల్లీ రిలీజ్ చేసింది. వీరితో పాటు ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్, అభిషేక్ పోరెల్, కరుణ్ నాయర్ వంటి మరికొందరు ఆటగాళ్లను కూడా ఢిల్లీ వదులుకోవడంతో, రాబోయే మినీ వేలంలో ఆ జట్టు రూ. 29 కోట్ల భారీ పర్స్‌తో బరిలోకి దిగనుంది.ట్రేడింగ్ విండోలో మరిన్ని సంచలనాలు:ఇతర జట్ల విషయానికి వస్తే.. ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్‌కు, పంజాబ్ స్టార్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ముంబై ఇండియన్స్‌కు చెరో రూ. 18 కోట్ల భారీ ధరతో ట్రేడ్ అవ్వడం ఈ సీజన్‌లో అతిపెద్ద సంచలనంగా మారింది. అలాగే చెన్నై సూపర్ కింగ్స్ దిగ్గజం మహేంద్రసింగ్ ధోనీ ఆటగాడిగా ఐపీఎల్‌కు వీడ్కోలు పలికి జట్టు మెంటార్‌గా కొత్త బాధ్యతలు చేపట్టడం క్రీడా వర్గాల్లో విశేషంగా నిలిచింది.



మను భాకర్‌కు అరుదైన గౌరవం

ఐఎస్ఎస్ఎఫ్ అథ్లెట్ల కమిటీకి ఎన్నికైన భారత షూటర్

న్యూఢిల్లీ, నవంబర్ 17 (సమయం న్యూస్): భారత స్టార్ మహిళా షూటర్ మను భాకర్‌కు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) అథ్లెట్ల కమిటీకి ఆమె ఎన్నికయ్యారు. కమిటీలోని రెండు పదవుల కోసం మొత్తం పది మంది క్రీడాకారులు పోటీపడగా, మను భాకర్ ఒక స్థానాన్ని దక్కించుకున్నారు. 2026 నుంచి 2030 వరకు పిస్టల్ విభాగంలో క్రీడాకారుల ప్రతినిధిగా ఆమె బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఈ విషయాన్ని భారత జాతీయ రైఫిల్ సంఘం (ఎన్ఆర్ఏఐ) వెల్లడించింది. అంతర్జాతీయ షూటింగ్ క్రీడల నిర్వహణ, క్రీడాకారుల సమస్యలు, సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో అథ్లెట్ల అభిప్రాయాలను వినిపించే అవకాశం మను భాకర్‌కు లభించనుంది. భారత షూటింగ్ క్రీడారంగానికి ఇది మరో విశేష గుర్తింపుగా నిలిచింది.

కెరీర్‌లో విరాట్ కోహ్లీ చేసిన అతిపెద్ద తప్పు అదే

- పదేళ్ల తర్వాత పశ్చాత్తాపపడతాడు: కపిల్ దేవ్
- టెస్టు క్రికెట్‌కు కోహ్లీ వీడ్కోలు పలకడంపై భారత దిగ్గజ కెప్టెన్ కీలక వ్యాఖ్యలు
- 25 ఏళ్ల యువ క్రికెటర్‌కు సైతం సవాలు విసరగలిగే అద్భుత ఫిట్‌నెస్ ఉండి కూడా రిటైర్ కావడం సరికాదని అభిప్రాయం
- కోపంతో తప్పుకోవడం కంటే మొహిందర్ అమర్‌నాథ్‌లా పోరాడి తిరిగి జట్టులోకి రావాల్సిందని సూచన



న్యూఢిల్లీ, నవంబర్ 17 (సమయం న్యూస్): టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడంపై భారత మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సుదీర్ఘ ఫార్మాట్ నుంచి తప్పుకోవాలని కోహ్లీ తీసుకున్న నిర్ణయం అతడి కెరీర్‌లో చేసిన అతిపెద్ద తప్పు అని కపిల్ దేవ్ అభిప్రాయపడ్డారు. ఎంతో అద్భుతమైన ఫిట్‌నెస్ ఉన్న విరాట్‌కు టెస్టుల్లో ఇంకా రాణించగల సత్తా పుష్కలంగా ఉందని, తొందరపడి తీసుకున్న ఈ నిర్ణయం పట్ల భవిష్యత్తులో కోహ్లీ తప్పకుండా పశ్చాత్తాపం వ్యక్తం చేస్తాడని ఆయన పేర్కొన్నారు.

కోపంతో రిటైర్ అవ్వడం సరికాదు - కపిల్ దేవ్

ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కపిల్ దేవ్ మాట్లాడుతూ.. "కోహ్లీ టెస్టుల నుంచి రిటైర్ అయి అతిపెద్ద తప్పు చేశాడని నేను అనుకుంటున్నా. ఈ నిర్ణయం తీసుకున్నందుకు పదేళ్ల తర్వాత అతడు కచ్చితంగా పశ్చాత్తాపపడతాడు. అసలు ఆ నిర్ణయం తీసుకోకుండా ఉండాల్సింది. అతడికి ఉన్నంత అద్భుతమైన ఫిట్‌నెస్ మరే ఆటగాడికి లేదు. ఫిట్‌నెస్ విషయంలో 25 ఏళ్ల యువ క్రికెటర్‌కు సైతం కోహ్లీ సవాలు విసరగలడు. కోపంతో రిటైర్ అవ్వడం ఎప్పటికీ సరికాదు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో మాజీ క్రికెటర్ మొహిందర్ అమర్‌నాథ్‌లా వ్యవహరించాలి. అమర్‌నాథ్‌ను ఎన్నోసార్లు జట్టు నుంచి తొలగించారు. అయినా ఆయన కుంగిపోకుండా తిరిగి జట్టులో చోటు సంపాదించుకుని, తన విషయంలో ఇతరుల అంచనాలు తప్పు అని నిరూపించారు" అని కపిల్ దేవ్ గుర్తుచేశారు.

వన్డేల్లో కొనసాగుతున్న కోహ్లీ ప్రస్థానం

2024లో టీ20 ప్రపంచకప్ విజయం తర్వాత అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు పలికిన విరాట్ కోహ్లీ, ఆ తర్వాత 2025 మే నెలలో టెస్టు క్రికెట్‌కు కూడా రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. 123 టెస్టులు ఆడిన కోహ్లీ 46.85 సగటుతో 9,230 పరుగులు సాధించి సుదీర్ఘ ఫార్మాట్ నుంచి తప్పుకున్నాడు. ప్రస్తుతం కేవలం వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్న కోహ్లీ.. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన ఐదు వన్డేల సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో 74 పరుగులతో రాణించినప్పటికీ, ఆ తర్వాతి మ్యాచ్‌లలో నిరాశపరిచాడు. అయితే, ఓవరాల్‌గా ఈ ఏడాది వన్డేల్లో 13 ఇన్నింగ్స్‌లు ఆడిన కోహ్లీ 53.17 సగటుతో 638 పరుగులు చేసి నిలకడగా రాణిస్తున్నాడు.



ఐపీఎల్‌కు ధోనీ గుడ్‌బై..

ఇక సీఎస్కే మెంటార్‌గా కొత్త ఇన్నింగ్స్!

చెన్నై, నవంబర్ 17 (సమయం న్యూస్): భారత క్రికెట్ దిగ్గజం మహేంద్రసింగ్ ధోనీ ఐపీఎల్ కెరీర్‌కు వీడ్కోలు పలికినట్లు వార్తలు వెలువడ్డాయి. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) జట్టుకు ఇకపై మెంటార్‌గా వ్యవహరించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ధోనీ రిటైర్మెంట్, మెంటార్ బాధ్యతలపై సీఎస్కే సామాజిక మాధ్యమాల ద్వారా ప్రకటన చేసినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ధోనీ ఐపీఎల్‌లోనూ ఆటగాడిగా తన ప్రయాణాన్ని ముగిస్తే, సీఎస్కే అభిమానులకు ఇది భావోద్వేగ ఘట్టంగా నిలవనుంది. ఐపీఎల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన కెప్టెన్లలో ఒకరిగా ధోనీ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన నాయకత్వంలో చెన్నై సూపర్ కింగ్స్ 2010, 2011, 2018, 2021, 2023 సీజన్లలో ఐపీఎల్ విజేతగా నిలిచింది. సీఎస్కేపై నిషేధం ఉన్న 2016, 2017 సీజన్లలో రైజింగ్ పుణె సూపర్‌జెయింట్ తరఫున ఆడారు. 2025లో రుతురాజ్ గైక్వాడ్ గాయపడటంతో మరోసారి తాత్కాలికంగా జట్టు నాయకత్వ బాధ్యతలు చేపట్టారు. ఐపీఎల్‌లో 278 మ్యాచ్‌లు ఆడి 5,439 పరుగులు సాధించిన ధోనీ వికెట్‌కీపర్‌గా 158 క్యాచ్‌లు, 47 స్టంపింగ్స్‌తోనూ తనదైన ముద్ర వేశారు.

సెలక్టర్లు ఎక్కడుంటే.. బంతిని అక్కడికే కొట్టాలి!



ధోనీ సినిమా డైలాగ్‌తో సూర్యకుమార్ సండడి

న్యూఢిల్లీ, నవంబర్ 17 (సమయం న్యూస్): భారత స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ మళ్లీ తన విధ్వంసకర బ్యాటింగ్‌తో అదరగొడుతున్నాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో ముంబై జట్టుకు నాయకత్వం వహిస్తున్న సూర్య వరుసగా రెండు మ్యాచ్‌ల్లో అర్ధశతకాలు బాది సత్తా చాటాడు. హైదరాబాద్‌పై కేవలం 21 బంతుల్లో 60 పరుగులు చేసిన అతడు గుజరాత్‌పై 29 బంతుల్లోనే 82 పరుగులతో చెలరేగాడు. ఫామ్ కోల్పోయి భారత జట్టుకు దూరమైన సూర్య తిరిగి జాతీయ జట్టులో చోటు సంపాదించేందుకు ప్రయత్నిస్తున్నాడనే చర్చ జరుగుతోంది. హైదరాబాద్‌తో మ్యాచ్ అనంతరం సూర్యకుమార్ మీడియాతో మాట్లాడుతూ తన బ్యాటింగ్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. మహేంద్రసింగ్ ధోనీ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన 'ఎంఎస్ ధోనీ: ది అన్‌టోల్డ్ స్టోరీ' చిత్రంలోని ఓ సంభాషణను గుర్తుచేశాడు. 'సెలక్టర్లు ఎక్కడ కూర్చుంటారో అక్కడికే బంతిని కొట్టాలి' అనే డైలాగ్‌ను ప్రస్తావిస్తూ తాను కూడా అదే తరహాలో ఆడానని చమత్కరించాడు. అయితే సెలక్టర్లకు సందేశం పంపడం తన ఉద్దేశం కాదని, పరుగులు సాధించి ముంబై జట్టును గెలిపించడంపైనే దృష్టి పెట్టానని స్పష్టం చేశాడు. కాగా, హైదరాబాద్‌తో మ్యాచ్‌ను బీసీసీఐ సెలక్టర్ శివసుందర్ దాస్ ప్రత్యక్షంగా వీక్షించారు. సాల్ట్‌లేక్‌లోని జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయ మైదానంలో సూర్య బాదిన ఓ భారీ సిక్సర్ మైదానం బయట పడటం విశేషం. టీ20 క్రికెట్ వినోదంతో కూడుకున్న ఆట అని, ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా ఆడాలని సూర్య పేర్కొన్నాడు. సాధన సమయంలో ప్రయత్నించిన షాట్లనే మ్యాచ్‌లో ఆడుతున్నానని, తన కృషికి ఫలితం దక్కుతోందని సంతోషం వ్యక్తం చేశాడు. వరుస అర్ధశతకాలతో సూర్య తిరిగి ఫామ్ అందుకోవడం క్రికెట్ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది.



సినీ పరిశ్రమలో భయంతో బతకాల్సి వస్తోంది!

బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా సంచలన వ్యాఖ్యలు

ముంబై, నవంబర్ 17 (సమయం న్యూస్): సినీ పరిశ్రమలో హీరోయిన్లు భయంతో బతకాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా ఆవేదన వ్యక్తం చేశారు. హీరోలు ఏం చేసినా అభిమానులు పెద్దగా పట్టించుకోరని, కొన్నిసార్లు వారి తప్పులను కూడా సమర్థిస్తారని అన్నారు. అదే హీరోయిన్ల విషయంలో మాత్రం చిన్న పొరపాటును సైతం భూతద్దంలో చూపిస్తూ సామాజిక మాధ్యమాల్లో తీవ్ర విమర్శలకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఊర్వశి సినీ పరిశ్రమలో నటీమణులు ఎదుర్కొంటున్న వివక్ష, సామాజిక మాధ్యమాల వేధింపులపై స్పందించారు. హీరోయిన్లు ఎలాంటి తప్పు చేయకపోయినా ఉద్దేశపూర్వకంగా విమర్శలు చేస్తున్నారని, చిన్న విషయాలను కూడా పెద్ద వివాదాలుగా మారుస్తున్నారని ఊర్వశి పేర్కొన్నారు. ఇలాంటి ప్రతికూల ప్రచారం వల్ల ఎంతోమంది నటీమణులు మానసిక ఒత్తిడికి, ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. హీరోలతో పోలిస్తే హీరోయిన్లే విమర్శలకు ఎక్కువగా భయపడాల్సి వస్తోందన్నారు. ప్రేక్షకులను అలరించేందుకు నటీమణులు ఎంతో కష్టపడతారని, వారి కృషిని ప్రశంసించకపోయినా అనవసర విమర్శలతో మనసులను గాయపరచవద్దని కోరారు. సినీ పరిశ్రమతోపాటు సమాజంలోనూ మహిళా నటుల పట్ల ఆలోచనా విధానం మారాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఊర్వశి చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి.



'బుట్టబొమ్మ' రికార్డు బద్దలు..
ఫోక్ సాంగ్ సెన్సేషన్!

అల్లు అర్జున్ సూపర్‌హిట్ పాటను అధిగమించిన 'రాను బొంబాయికి రాను'

హైదరాబాద్, నవంబర్ 17 (సమయం న్యూస్): తెలుగు సంగీత ప్రపంచంలో ఓ జానపద గీతం సరికొత్త సంచలనం సృష్టించింది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన 'అల వైకుంఠపురములో' చిత్రంలోని సూపర్‌హిట్ పాట 'బుట్టబొమ్మ' యూట్యూబ్ వీక్షణల రికార్డును 'రాను బొంబాయికి రాను' జానపద గీతం అధిగమించినట్లు సమాచారం. త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'అల వైకుంఠపురములో' చిత్రంలోని 'బుట్టబొమ్మ' పాట 95.5 కోట్లకు పైగా వీక్షణలు సాధించగా, తాజాగా 'రాను బొంబాయికి రాను' పాట 95.7 కోట్లకు పైగా వీక్షణలతో దాన్ని దాటేసింది. రాము రాథోడ్, లిఖిత ఆలపించిన 'రాను బొంబాయికి రాను' పాట 2025 జనవరి 23న విడుదలైంది. విడుదలైనప్పటి నుంచి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటూ తక్కువ సమయంలోనే కోట్లాది వీక్షణలు సొంతం చేసుకుంది. భారీ బడ్జెట్ చిత్రంలోని స్టార్ హీరో పాటను ఓ జానపద గీతం అధిగమించడం సంగీత ప్రియుల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. మరోవైపు దక్షిణాది సినిమా పాటల్లో ధనుష్ నటించిన 'మారి 2' చిత్రంలోని 'రౌడీ బేబీ' సుమారు 177 కోట్ల వీక్షణలతో అగ్రస్థానంలో కొనసాగుతున్నట్లు సమాచారం. జానపద సంగీతానికి పెరుగుతున్న ఆదరణకు 'రాను బొంబాయికి రాను' విజయమే నిదర్శనంగా నిలుస్తోంది.



స్టెప్పులతో అదరగొట్టిన సాయిపల్లవి, శ్రీలీల

ధనుష్ హీరోగా నటించిన 'హ.వీ' సినిమా ప్రీరిలీజ్ వేడుక హైదరాబాద్‌లోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా జరిగింది. మమ్ముట్టి, సాయిపల్లవి, శ్రీలీల, రేణు దేశాయ్ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహించారు. నవంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ వేడుకలో సాయిపల్లవి, శ్రీలీల ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఇద్దరూ కలిసి వేదికపై డాన్స్ చేయడంతో అభిమానులు కేరింతలు కొట్టారు. వారి స్టెప్పులకు హీరో ధనుష్ చప్పట్లు కొడుతూ అభినందించారు. ప్రస్తుతం వీరిద్దరి డాన్స్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.







పూజా హెగ్డే గ్రాండ్ రీ-ఎంట్రీ!

నాలుగేళ్ల విరామం తర్వాత తెలుగు సినిమాలపై ఫోకస్



ఒకప్పుడు టాలీవుడ్‌లో స్టార్ హీరోల సరసన వరుస సినిమాలతో టాప్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న పూజా హెగ్డే.. కొంతకాలంగా తెలుగు తెరకు దూరంగా ఉంటున్నారు. 2022లో 'ఆచార్య' తర్వాత పూర్తిస్థాయి తెలుగు సినిమాలో కనిపించలేదు. బాలీవుడ్, కోలీవుడ్ చిత్రాలతో బిజీగా గడిపిన ఈ బుట్టబొమ్మ ఇప్పుడు మళ్లీ టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు. దుల్కర్ సల్మాన్ హీరోగా రవి నేలకుదిటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'శ్రీ శ్రీ' సినిమాతో పూజా రీఎంట్రీ ఇవ్వనున్నట్లు సమాచారం. మరోవైపు అల్లు అర్జున్-లోకేశ్ కనగరాజ్ కాంబినేషన్‌లో రూపొందనున్న సినిమాలోనూ ఆమె పేరు వినిపిస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. వరుసగా భారీ ప్రాజెక్టుల్లో అవకాశాలు దక్కించుకుంటున్నారనే ప్రచారంతో పూజా సెకండ్ ఇన్నింగ్స్‌పై ఆసక్తి పెరుగుతోంది. మరి ఈ సినిమాలతో బుట్టబొమ్మ మళ్లీ టాలీవుడ్‌లో తన పూర్వ వైభవాన్ని అందుకుంటుందేమో చూడాలి.

క్యాస్టింగ్ కౌచ్ నిన్నా ఉంది.. నేడూ ఉంది.. రేపూ ఉంటుంది!

సినీ పరిశ్రమలోని వేధింపులపై రమ్యకృష్ణ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, నవంబర్ 17 (సమయం న్యూస్): సినీ పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ వ్యవహారంపై సీనియర్ నటి రమ్యకృష్ణ సంచలన వ్యాఖ్యలు చేశారు. క్యాస్టింగ్ కౌచ్ గతంలో జరిగిందని, ప్రస్తుతం జరుగుతోందని, భవిష్యత్తులోనూ కొనసాగే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా సినీ పరిశ్రమలో కొనసాగుతున్న రమ్యకృష్ణ తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ అంశంపై స్పందించారు. క్యాస్టింగ్ కౌచ్ అసలు లేదని చెప్పడం వాస్తవాలను కప్పిపుచ్చడమేనని అభిప్రాయపడ్డారు. కాలాన్ని బట్టి వేధింపులు జరిగే విధానం మారుతుందని, బలవంతంగా జరుగుతున్నాయా, పరస్పర అంగీకారంతో జరుగుతున్నాయా అనే అంశాలను వేర్వేరుగా చూడాల్సి ఉంటుందని వివరించారు. అయితే క్యాస్టింగ్ కౌచ్ ప్రస్తావన వచ్చినప్పుడల్లా సినీ పరిశ్రమనే ఎందుకు వేలెత్తి చూపుతున్నారని రమ్యకృష్ణ ప్రశ్నించారు. సినిమా రంగం అందరి దృష్టిని ఆకర్షించే రంగం కావడంతో ఇక్కడ జరిగే సంఘటనలపైనే ఎక్కువ చర్చ జరుగుతోందన్నారు. వాస్తవానికి లైంగిక వేధింపులు కేవలం సినీ పరిశ్రమకే పరిమితం కాలేదని, ఇతర రంగాల్లోనూ ఇలాంటి సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. మహిళలతోపాటు పురుషులు కూడా వేధింపులకు గురవుతున్నారని తెలిపారు. ఈ సమస్యను ఒక్క రంగానికి మాత్రమే ఆపాదించడం సరికాదని, అన్ని రంగాల్లోనూ వేధింపులను అరికట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రమ్యకృష్ణ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**